# తెలంగాణ TELANGANA MUCHATLU



# ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 25 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 171 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


### కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ స్టేషన్ ఘనపూర్‌లో

# సోషల్ మీడియా వార్!



- కడియం శ్రీహరిపై గులాబీ దండు ప్రశ్నాస్త్రాలు..
- గత రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ ఘాటు విమర్శలు!
- కాంగ్రెస్‌లో అచ్చ–పచ్చ పంచాయితీని తెరపైకి తెచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు
- పాత కాంగ్రెస్ నాయకులకు గుర్తింపు ఏదీ?
- సింగపురం ఇందిరా, కొలిపాక సతీష్‌ల పరిస్థితిపై నిలదీత!

స్టేషన్ ఘనపూర్,నవంబర్24 (తెలంగాణ ముచ్చట్లు):

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య రాజకీయ విమర్శలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల వేదికగా హోరెత్తుతున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాజకీయ వైఖరిని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వరుస పోస్టులతో విరుచుకుపడుతున్నారు. గతంలో బీఆర్ఎస్‌లో ఆయన అనుభవించిన పదవులు, పార్టీ కల్పించిన రాజకీయ అవకాశాలను గుర్తుచేస్తూ సూటి ప్రశ్నలు సంధిస్తున్నారు. అంతటితో ఆగకుండా కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత పరిస్థితులు, పాత నాయకులకు జరుగుతున్న అన్యాయాన్ని కూడా ఎత్తిచూపుతూ 'అచ్చ కాంగ్రెస్-పచ్చ కాంగ్రెస్' అంశాన్ని తెరపైకి తీసుకొస్తున్నారు. దీంతో స్టేషన్ ఘనపూర్ రాజకీయాలు సామాజిక మాధ్యమాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

**కడియం శ్రీహరి గారూ..**
**బీఆర్ఎస్ మీకు చేసిన ద్రోహం ఏమిటి?**

కడియం శ్రీహరిని ఉద్దేశించి బీఆర్ఎస్ శ్రేణులు సంధిస్తున్న ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఎమ్మెల్సీగా, ఎంపీగా, ఉప ముఖ్యమంత్రిగా కీలక పదవులు అనుభవించే అవకాశం కల్పించిన బీఆర్ఎస్ పార్టీ మీకు చేసిన ద్రోహం ఏమిటని ప్రశ్నిస్తున్నాయి. మిమ్మల్ని గెలిపించి రాజకీయంగా ప్రాధాన్యత కల్పించిన పార్టీని ఇప్పుడు విమర్శించడం వెనుక కారణమేంటని నిలదీస్తున్నాయి.

మీ కుమార్తెకు ఎంపీగా అవకాశం కల్పించిన పార్టీ రాజకీయ ప్రాధాన్యతను మరిచిపోయారా? పదవులు అనుభవించినప్పుడు పార్టీ మంచిదిగా కనిపించి, రాజకీయ పరిస్థితులు మారగానే చెడ్డదైందా? అంటూ ఘాటుగా ప్రశ్నిస్తున్నాయి.నీతి, నిజాయితీ, నిబద్ధత గురించి మాట్లాడే మీరు ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నారో ప్రజలకు స్పష్టంగా చెప్పే ధైర్యం ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నాయి. పార్టీ మార్పుపై మీ వైఖరిని బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నాయి.

**పదవులు వచ్చినప్పుడు బీఆర్ఎస్ గుర్తుకురాలేదా?**

కడియం శ్రీహరి రాజకీయ ఎదుగుదలలో బీఆర్ఎస్ నాయకత్వం, కార్యకర్తల పాత్రను గుర్తుచేస్తూ గులాబీ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఎన్నికల సమయంలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల శ్రమతో గెలిచి, ఇప్పుడు అదే పార్టీపై విమర్శలు చేయడం ఏ విధమైన రాజకీయ నిబద్ధత అని నిలదీస్తున్నాయి.

ఎమ్మెల్సీ, ఎంపీ, ఉప ముఖ్యమంత్రి వంటి పదవులు అనుభవించిన తర్వాత కూడా నియోజకవర్గ అభివృద్ధికి అవకాశం రాలేదంటే ప్రజలు నమ్మాలా? మంత్రి పదవి వస్తేనే అభివృద్ధి చేస్తారా? రేపు ఎన్నికల సమయంలో మంత్రి పదవి రాలేదని, అందుకే అభివృద్ధి చేయలేకపోయానని మరోసారి సాకులు చెబుతారా? అంటూ ప్రశ్నిస్తున్నాయి.రేపు మరో పార్టీ నుంచి మరింత ఉన్నతమైన పదవి వస్తే అక్కడికి కూడా వెళ్తారా? మీ రాజకీయ నిబద్ధతకు హద్దు ఎక్కడ? అంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాయి.

**అచ్చ కాంగ్రెస్ నాయకులను పక్కనపెట్టి.. పచ్చ కాంగ్రెస్ నాయకులకు పెద్దపీట వేస్తున్నారా?**

కడియం శ్రీహరిపై విమర్శలకే పరిమితం కాకుండా కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత రాజకీయాలనూ బీఆర్ఎస్ శ్రేణులు లక్ష్యంగా చేసుకున్నాయి. 'అచ్చ కాంగ్రెస్-పచ్చ కాంగ్రెస్' అంటూ కొత్త చర్చను తెరపైకి తెచ్చి

మిగతా 2 లో..




బిఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్న ఫోటో

## పచ్చ కాంగ్రెస్...అచ్చ కాంగ్రెస్!

కడియం శ్రీహరి రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీతో ప్రారంభమై, అక్కడి నుంచి బీఆర్ఎస్, అనంతరం కాంగ్రెస్ వరకు సాగింది. ఈ రాజకీయ ప్రయాణంలో ఆయన వెంట నడుస్తూ, పార్టీలు మారిన ప్రతిసారీ ఆయనతోనే కొనసాగిన అనుచరులను ఉద్దేశించి బీఆర్ఎస్ శ్రేణులు 'పచ్చ కాంగ్రెస్' అంటూ విమర్శలు సంధిస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి కాకపోయినా, మొదటి నుంచి ఆ పార్టీలోనే ఉంటూ కష్టనష్టాలకు ఎదురొడ్డి జెండా మోసిన అసలైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను 'అచ్చ కాంగ్రెస్'గా అభివర్ణిస్తున్నాయి. ఇప్పుడు అధికారంలో కాంగ్రెస్ ఉన్నప్పటికీ.. కడియం వెంట వచ్చిన పచ్చ కాంగ్రెస్ నాయకులకే రాజకీయ ప్రాధాన్యత, పదవులు దక్కుతున్నాయా? పార్టీని నమ్ముకుని దశాబ్దాలుగా పనిచేసిన అచ్చ కాంగ్రెస్ నాయకులు మాత్రం ఇంకా ఎదురుచూపుల్లోనే ఉండాలా? అంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

పార్టీ కష్టకాలంలో జెండా మోసింది అచ్చ కాంగ్రెస్ నాయకులు.. అధికారం రాగానే పదవులు అనుభవించేది పచ్చ కాంగ్రెస్ నాయకులా? ఇదేనా కాంగ్రెస్‌లో పార్టీ కోసం పనిచేసిన వారికి దక్కుతున్న గౌరవం? కడియం వెంట వచ్చిన వారికి పదవులు కట్టబెట్టే ముందు, కాంగ్రెస్ కోసం జీవితాలను అంకితం చేసిన పాత నాయకుల గురించి ఆలోచించారా? సింగపురం ఇందిరా లాంటి నాయకురాలికి గుర్తింపు ఎక్కడ? కొలిపాక సతీష్ లాంటి సీనియర్ నాయకుడికి కనీసం నామినేటెడ్ పదవి ఇవ్వాలన్న ఆలోచన లేదా? అంటూ బీఆర్ఎస్ శ్రేణులు నిలదీస్తున్నాయి. పార్టీలు మారుతూ వచ్చిన వారికి పదవులు.. పార్టీనే నమ్ముకుని ఉన్నవారికి నిరీక్షణ! ఇదేనా కాంగ్రెస్‌లో కొనసాగుతున్న రాజకీయ న్యాయం? అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా విమర్శల వాడి పెంచుతున్నాయి.

### తెలంగాణకు కేంద్రం

# 13 లక్షల కోట్ల నిధులు

- మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి భారీగా నిధులిచ్చిందని రామచందర్‌రావు వెల్లడి
- పేదలకు ఉచిత బియ్యం కేంద్రం నుంచే సరఫరా
- ప్రతి నియోజకవర్గానికి కాంగ్రెస్ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్
- రాష్ట్ర నిధులు కొడంగల్‌కే వెళ్తున్నాయని సొంత ఎమ్మెల్యేల ఆరోపణలు



హైదరాబాద్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):

కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఇప్పటివరకు సుమారు రూ.13 లక్షల కోట్ల నిధులు అందించిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు. పేదలకు పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యాన్ని కూడా కేంద్ర ప్రభుత్వమే అందిస్తోందని పేర్కొన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఏమి ఇచ్చిందని ప్రశ్నించే నైతిక హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని వ్యాఖ్యానించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందిన నిధులు, సంక్షేమ పథకాలపై మాట్లాడే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తన పాలనలో ప్రజలకు చేసిన పనుల గురించి సమాధానం చెప్పాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రభుత్వం ఏ మేరకు నిధులు కేటాయించింది?

మిగతా 2 లో..

## కృష్ణా జలాల వినియోగంపై రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసిన హరీశ్‌రావు

- తెలంగాణ ఏర్పడిన తర్వాత రెండేళ్లలోనే అత్యల్ప నీటి వినియోగం
- పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుపై అభ్యంతరాలు
- కృష్ణా జలాల వాటాలో కాంగ్రెస్‌దే బాధ్యతని ఆరోపణ



హైదరాబాద్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):

కృష్ణా జలాల వినియోగం, రాష్ట్రానికి దక్కాల్సిన నీటి వాటా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు.

మిగతా 2 లో..

## డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా హైదరాబాద్‌లో పాదయాత్ర

- నవంబర్ 25 నుంచి 27 వరకు 'నషా ముక్త భారత్' కార్యక్రమం
- అంబర్‌పేట్‌లో ప్రారంభమై జూబ్లీహిల్స్‌లో ముగింపు
- 2029 నాటికి మత్తుపదార్థాల రహిత సమాజమే లక్ష్యం: కిషన్‌రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):

దేశ యువతను పట్టిపీడిస్తున్న మత్తుపదార్థాల మహమ్మారిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి

మిగతా 2 లో..



### ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు

# రూ.10 వేల కోట్ల కార్యాచరణ

- వాతావరణ మార్పులపై శాస్త్రీయ పరిష్కారాలే లక్ష్యం
- ఐదు నెలల పాటు ప్రత్యేక సన్నద్ధత కార్యక్రమం
- చెరువులు, కాలువల పునరుద్ధరణకు ప్రాధాన్యం
- క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):

వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు శాస్త్రీయంగా నిరూపితమైన, క్షేత్రస్థాయిలో అమలు చేయగల పరిష్కారాలను రూపొందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ కేవలం సిద్ధాంతపరమైన చర్చలకే పరిమితం కాకుండా, కరువు నివారణ, నీటి భద్రత, సుస్థిర వ్యవసాయానికి ఉపయోగపడే కార్యాచరణను రూపొందించే వేదికగా నిలవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో సంభవించే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఇందులో ప్రధానంగా ప్రదర్శించాలని స్పష్టం చేశారు.

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించనున్న క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపై మంత్రి మంగళవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమ రూపకల్పన, పర్యావరణ నిపుణుల భాగస్వామ్యం, పెట్టుబడిదారులతో చర్చలు, ప్రదర్శన విభాగాలు, ఆడియో-విజువల్ కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు. ప్రపంచ వ్యాప్తంగా విజయవంతమైన వాతావరణ అనుకూల విధానాలతో పాటు ఇక్రిశాట్ గుర్తించిన ఉత్తమ వ్యవసాయ పద్ధతులను కూడా ప్రదర్శనల్లో పొందుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

మిగతా 2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ స్టేషన్ ఘనపూర్‌లో

# సోషల్ మీడియా వార్!

(మొదటి పేజీ తరువాయి)

హస్తం పార్టీలోని పరిస్థితులను ప్రశ్నిస్తున్నాయి.దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలిచిన అసలైన కాంగ్రెస్ నాయకులు ఒకవైపు ఉంటే.. ఇతర పార్టీల నుంచి వచ్చి అధికారంలో ప్రాధాన్యత పొందుతున్న నాయకులు మరోవైపు ఉన్నారంటూ విమర్శిస్తున్నాయి. పార్టీ కోసం జీవితాలు ధారపోసిన పాత కాంగ్రెస్ నాయకులను పక్కనపెట్టి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పదవులు, అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ రాజకీయమా? పార్టీ కష్టకాలంలో జెండా మోసిన వారికి అధికారం వచ్చిన తర్వాత గుర్తింపు ఎందుకు దక్కడం లేదు? అంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

అసలైన కాంగ్రెస్ నాయకులను పక్కనపెట్టి, కొత్తగా వచ్చిన నాయకులకు ప్రాధాన్యత కల్పిస్తే పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ఇచ్చే సందేశం ఏమిటని నిలదీస్తున్నారు. అచ్చ కాంగ్రెస్ నాయకుల కష్టానికి విలువ లేదా? పచ్చ కాంగ్రెస్ నాయకులకే పదవులు, అధికారం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారా? అంటూ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు.

**సింగపురం ఇందిరా, కొలిపాక సతీష్‌లకు గుర్తింపు ఏదీ?**

ఈ సందర్భంగా సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న సింగపురం ఇందిరా పరిస్థితిని బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నాయి. ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడిన నాయకురాలికి ప్రస్తుతం కాంగ్రెస్‌లో దక్కుతున్న ప్రాధాన్యత ఏమిటి? ఆమె రాజకీయ భవిష్యత్తు ఏమిటి? అంటూ ప్రశ్నిస్తున్నాయి.

అదేవిధంగా స్టేషన్ ఘనపూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కొలిపాక సతీష్‌కు పార్టీలో తగిన గుర్తింపు ఎందుకు కల్పించడం లేదని నిలదీస్తున్నాయి. పార్టీ కోసం సుదీర్ఘకాలంగా పనిచేసిన నాయకుడికి కనీసం ఒక నామినేటెడ్ పదవి లేదా పార్టీలో ప్రాధాన్యత కలిగిన బాధ్యత అప్పగించే చిత్తశుద్ధి కాంగ్రెస్ నాయకత్వానికి ఉందా? అని ప్రశ్నిస్తున్నాయి.పార్టీ కోసం కష్టపడిన పాత నాయకులను విస్మరించి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పెద్దపీట వేస్తున్నారన్న విమర్శలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికైనా అసలైన పార్టీ నాయకుల కష్టాన్ని గుర్తిస్తుందా? లేక వారిని పక్కనపెట్టే రాజకీయాలే కొనసాగిస్తుందా? అంటూ సవాల్ విసురుతున్నాయి.

**గులాబీ ప్రశ్నలకు సమాధానాలేవి?**

**హస్తం పార్టీలో పాత నాయకులకు న్యాయం ఎప్పుడు?**

ఒకవైపు కడియం శ్రీహరి గత రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నలు సంధిస్తుంటే.. మరోవైపు కాంగ్రెస్‌లోని అచ్చ కాంగ్రెస్-పచ్చ కాంగ్రెస్ వివాదాన్ని కూడా అదే వేదికగా ఎండగడుతున్నారు. పార్టీ మార్పులు, పదవులు, రాజకీయ నిబద్ధత, పాత నాయకులకు గుర్తింపు వంటి అంశాలన్నింటినీ సామాజిక మాధ్యమాల చర్చలోకి తీసుకొస్తున్నారు.బీఆర్ఎస్ పార్టీ కల్పించిన అవకాశాలపై కడియం శ్రీహరి ఏం సమాధానం చెబుతారు? కాంగ్రెస్‌లో అసలైన పాత నాయకులకు ఎందుకు గుర్తింపు దక్కడం లేదన్నప్రశ్నకు హస్తం పార్టీ నాయకత్వం ఏం సమాధానం ఇస్తుంది? సింగపురం ఇందిరా, కొలిపాక సతీష్‌లకు రాజకీయంగా ఎలాంటి ప్రాధాన్యత లభిస్తుంది? అన్నది ఇప్పుడు నియోజకవర్గ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

మొత్తానికి స్టేషన్ ఘనపూర్‌లో గులాబీ శ్రేణులు సంధిస్తున్న ప్రశ్నలు కాంగ్రెస్‌కు రాజకీయ సవాళ్లుగా మారుతున్నాయి. కడియం శ్రీహరిపై విమర్శలతో మొదలైన ఈ సామాజిక మాధ్యమాల పోరు.. కాంగ్రెస్‌లోని అంతర్గత అసంతృప్తిని కూడా తెరపైకి తీసుకొచ్చింది. ఈ ప్రశ్నలకు సమాధానాలు వస్తాయా? లేక రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలతోనే కాలం గడుస్తుందా? అన్నది వేచి చూడాలి.

# తెలంగాణకు కేంద్రం 13 లక్షల కోట్ల నిధులు

(మొదటి పేజీ తరువాయి)

ఏయే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది? ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు కల్పించింది? అనే అంశాలను మంత్రులు వివరించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేసే కాంగ్రెస్ నాయకులు ముందుగా తమ ప్రభుత్వ పనితీరును సమీక్షించుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా చేపట్టిన పనులు, కేటాయించిన నిధుల వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నిధులన్నీ కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గానికే వెళ్తున్నాయని కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఆరోపిస్తున్నారని రామచందర్‌రావు ప్రస్తావించారు. అధికార పార్టీ శాసనసభ్యుల నుంచే ఇలాంటి విమర్శలు వస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం దీనిపై వివరణ ఇవ్వాలని అన్నారు. ఇతర నియోజకవర్గాల అభివృద్ధి, నిధుల కేటాయింపుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని కోరారు.తెలంగాణకు కేంద్రం అందిస్తున్న నిధులు, పేదలకు ఉచిత బియ్యం సరఫరా వంటి అంశాలను ప్రజలు గుర్తించాలని రామచందర్‌రావు పేర్కొన్నారు.కేంద్రం రాష్ట్రానికి ఏమి చేసిందనే ప్రశ్నకు సమాధానం చెప్పే ముందు, కాంగ్రెస్ ప్రభుత్వం తన హామీలు, నియోజకవర్గాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులపై ప్రజలకు లెక్కలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు

# రూ.10 వేల కోట్ల కార్యాచరణ

(మొదటి పేజీ తరువాయి)

జయేశ్ రంజన్, టీజీ ట్రాన్స్‌కో సీఎండీ డి. కృష్ణభాస్కర్ తదితర అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఐదు నెలల ఎల్‌నినో సన్నద్ధత కార్యక్రమాన్ని కాంక్లేవ్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. సుమారు రూ.10 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ కార్యక్రమంలో సంక్రాంతి తర్వాత ప్రతి నెలా దాదాపు రూ.2 వేల కోట్ల విలువైన పనులు అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా చెరువులు, వాగులు, కాలువల పునరుద్ధరణ, భూగర్భ జలాల రీఛార్జ్, వర్షపు నీటి సంరక్షణ, గ్రామీణ నీటి వనరుల పరిరక్షణ పనులు చేపట్టనున్నాయి. వ్యవసాయ పనులు తగ్గే సమయంలో గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడం కూడా ఈ కార్యాచరణలో భాగంగా ఉంటుందని మంత్రి వివరించారు.

సంభావ్య కరువు పరిస్థితుల్లో ప్రజలకు తాగునీరు, ఆహార భద్రత కల్పించేందుకు తీసుకుంటున్న ముందస్తు చర్యలను ప్రదర్శనల ద్వారా వివరించాలని అధికారులకు సూచించారు. వచ్చే వర్షాకాలం వరకు జలాశయాల్లో నీటి నిల్వలను కాపాడుకునే ఉద్దేశంతో అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేయగల పంటల వైపు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలకు దాదాపు ఏడాది పాటు సరిపడే బియ్యం నిల్వలు రాష్ట్రంలో ఉన్నాయని వెల్లడించారు. కరువు కారణంగా పంట దిగుబడులు తగ్గినా ప్రజలకు ఆహార కొరత రాకుండా ఈ నిల్వలు తోడ్పడతాయని పేర్కొన్నారు.పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విస్తరణ, శుద్ధి చేసిన మురుగునీటిని పరిశ్రమల్లో తిరిగి వినియోగించడం, రాష్ట్రాన్ని నెట్ జీరో లక్ష్యాల దిశగా తీసుకెళ్లే చర్యలపైనా కాంక్లేవ్‌లో చర్చించనున్నారు. రాష్ట్రంలోని డేటా కేంద్రాలు తమ విద్యుత్ అవసరాల్లో కనీసం 51 శాతాన్ని పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి పొందాలనే నిబంధన అమల్లో ఉందని అధికారులు వివరించారు. పర్యావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు, నీటి సంరక్షణ రంగ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, పెట్టుబడిదారులతో పాటు సుమారు 125 మంది గ్రామీణ ప్రతినిధులు చర్చల్లో పాల్గొననున్నారు.నీటి భద్రత, జీవవైవిధ్య పరిరక్షణ, పట్టణ ఉష్ణోగ్రతల నియంత్రణ, స్వచ్ఛ ఇంధనం, పర్యావరణ పర్యాటకం, గ్రీన్ క్రెడిట్లు, వ్యర్థాల పునర్వినియోగం వంటి అంశాలపై చర్చించడంతో పాటు పెట్టుబడి అవకాశాలను పరిచయం చేసే ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయనున్నారు.

# పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'

- **డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో సదస్సు**
- **ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాలు**
- **ఐటీ, ఫార్మా, రక్షణ, అంతరిక్ష రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యం**
- **యువతకు భారీగా ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వ దృష్టి**



**హైదరాబాద్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో పెట్టుబడులను ప్రోత్సహించి, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను ఆకర్షించే లక్ష్యంతో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూలతలు, పారిశ్రామిక రంగంలో సాధించిన ప్రగతి, 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్యాలు, భవిష్యత్తు ప్రణాళికలను అంతర్జాతీయ ప్రతినిధులకు సమగ్రంగా వివరించేలా సదస్సును రూపొందించాలని సూచించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఈ సదస్సు జరగనుంది. ఈ నేపథ్యంలో మంత్రి శ్రీధర్‌బాబు మంగళవారం ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. తెలంగాణ బ్రాండ్ ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో మరింత పెంచడంతో పాటు, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు తీసుకురావడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశమని వివరించారు.

పెట్టుబడుల రాకతో రాష్ట్రంలోని యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రభుత్వ సంకల్పమని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధనకు గ్లోబల్ సమ్మిట్‌ను కీలక వేదికగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. సదస్సుకు హాజరయ్యే పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్ పనులను నిర్దిష్ట గడువులోగా ముగించేందుకు కార్యాచరణ రూపొందించాలని స్పష్టం చేశారు. భద్రత, వాహనాల పార్కింగ్, ఆతిథ్యం, రవాణా సదుపాయాలు, కనెక్టివిటీ, ట్రాఫిక్ నియంత్రణ, నిరంతర విద్యుత్ సరఫరా, హైస్పీడ్ ఇంటర్నెట్, అత్యవసర వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతినిధులకు ప్రయాణ సౌకర్యాలు సజావుగా ఉండేలా ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఆతిథ్య ఏర్పాట్లు చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు.

తెలంగాణలో అందుబాటులో ఉన్న సమగ్ర పారిశ్రామిక వ్యవస్థ, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి సామర్థ్యాన్ని ప్రతిబింబించేలా ప్రదర్శన విభాగాలను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని శ్రీధర్‌బాబు సూచించారు. ముఖ్యంగా సమాచార సాంకేతిక పరిజ్ఞానం, ఔషధ పరిశ్రమలు, రక్షణ రంగం, విమానయాన-అంతరిక్ష రంగాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఆయా రంగాల్లో తెలంగాణకు ఉన్న అవకాశాలను పెట్టుబడిదారులకు స్పష్టంగా పరిచయం చేసేలా ప్రదర్శనలు, సమాచార ఏర్పాట్లు ఉండాలని తెలిపారు.

# డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా హైదరాబాద్‌లో పాదయాత్ర

(మొదటి పేజీ తరువాయి)

జి. కిషన్‌రెడ్డి వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హైదరాబాద్‌లో నవంబర్ 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు 'నషా ముక్త భారత్' పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త భారత్' పేరుతో చేపట్టే ఈ కార్యక్రమం నవంబర్ 25న అంబర్‌పేట్‌లో ప్రారంభమై, 27న జూబ్లీహిల్స్‌లో ముగుస్తుందని వివరించారు. సుమారు 30 కిలోమీటర్ల మేర నగరంలోని ప్రముఖ కూడళ్ల మీదుగా ఈ పాదయాత్ర కొనసాగనుంది. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న 'నషా ముక్త భారత్ అభియాన్'లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. యువతలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రజలను చైతన్యపరచడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని కిషన్‌రెడ్డి తెలిపారు.

ప్రస్తుతం దేశ యువత ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో మత్తుపదార్థాల వినియోగం ఒకటని కేంద్రమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది యువత డ్రగ్స్ బారినపడి తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ అలవాటు వ్యక్తుల ఆరోగ్యానికే కాకుండా కుటుంబ వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం చూపుతోందని, మత్తుపదార్థాల కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని వివరించారు. డ్రగ్స్ వినియోగం వల్ల పంజాబ్‌లో ఏర్పడిన పరిస్థితులు ఇతర రాష్ట్రాల్లో పునరావృతం కాకూడదని కిషన్‌రెడ్డి అన్నారు. యువతను ఈ వ్యసనం నుంచి కాపాడేందుకు సమాజంలోని అన్ని వర్గాలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే దేశవ్యాప్తంగా మత్తుపదార్థాల వ్యతిరేక ఉద్యమాన్ని బలోపేతం చేయాలని ప్రధానమంత్రి మోదీ పిలుపునిచ్చినట్లు వివరించారు.

2029 నాటికి దేశాన్ని మత్తుపదార్థాల రహిత సమాజంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ పోరాటంలో యువత, తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో నిర్వహించే పాదయాత్రకు సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, ప్రభాస్‌తో పాటు పలువురు క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. వారి భాగస్వామ్యంతో డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.

# కృష్ణా జలాల వినియోగంపై రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసిన హరీశ్‌రావు

(మొదటి పేజీ తరువాయి)

202425, 202526 సంవత్సరాల్లో తెలంగాణ వినియోగించుకున్న కృష్ణా జలాల గణాంకాలను ప్రస్తావిస్తూ, రాష్ట్రం ఏర్పడిన తర్వాత అత్యల్ప స్థాయిలో నీటిని వినియోగించుకున్న పరిస్థితి ఈ ప్రభుత్వ హయాంలోనే ఏర్పడిందని ఆరోపించారు. నీటి వినియోగంపై ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యల్లో వాస్తవాలు లేవని విమర్శించారు. 202425 సంవత్సరంలో కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్ 718 టీఎంసీలు వినియోగించుకోగా, తెలంగాణ 286 టీఎంసీలు మాత్రమే వాడుకుందని హరీశ్‌రావు వివరించారు. తాత్కాలిక కేటాయింపుల్లో తెలంగాణకు 34 శాతం వాటా ఉన్నప్పటికీ, ఆ ఏడాది 28 శాతం నీటినే వినియోగించుకుందని పేర్కొన్నారు. 202526లో ఆంధ్రప్రదేశ్ 771 టీఎంసీలు వాడుకోగా, తెలంగాణ వినియోగం 267 టీఎంసీలకు పరిమితమైందని తెలిపారు. ఇది రాష్ట్రం ఏర్పడిన తర్వాత అత్యల్ప వినియోగమని వ్యాఖ్యానించారు. ఒక సందర్భంలో టీఎంసీల ప్రాతిపదికన, మరో సందర్భంలో శాతం ప్రాతిపదికన ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారని విమర్శించారు.

కృష్ణా జలాలపై ట్రిబ్యునల్ ఏర్పాటు విషయంలో గతంలో కేసీఆర్ కేంద్రాన్ని ప్రశ్నించిన విషయాన్ని కూడా హరీశ్‌రావు ప్రస్తావించారు. ఏడేళ్లుగా ట్రిబ్యునల్ ఏర్పాటు చేయకపోవడంపై అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ కేంద్ర మంత్రిని నిలదీశారని గుర్తుచేశారు. నాగార్జునసాగర్ నుంచి ఆంధ్రప్రదేశ్ నీటిని తీసుకెళ్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. కల్వకుర్తి, శ్రీశైలం ప్రాజెక్టుల్లో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ మోటార్లను పూర్తిస్థాయిలో నడపలేదని, దూర ప్రాంతాలకు నీటిని తరలించే విషయంలోనూ తెలంగాణ ప్రయోజనాలను పట్టించుకోలేదని విమర్శించారు.

దేవాదుల ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోసే విషయంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, దాని ప్రభావంతో వరంగల్ ప్రాంతం సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటోందని హరీశ్‌రావు ఆరోపించారు. పల్నాడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్‌కు అనుకూలంగా వ్యవహరించి అప్పగించారంటూ రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేశారు. ఇటీవల కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశంలో పల్నాడు ప్రాజెక్టుపై చర్చ జరగలేదని, దాన్ని నిలిపివేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరలేదని పేర్కొన్నారు. 2022లోనే ఆ ప్రాజెక్టుకు సంబంధించిన జీవో వచ్చిందన్న ముఖ్యమంత్రి వాదనను కూడా ఆయన తప్పుబట్టారు.

కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీల వాటా నిర్ణయించడంలో కాంగ్రెస్ పార్టీదే ప్రధాన బాధ్యతని హరీశ్‌రావు ఆరోపించారు. అప్పటి తెలంగాణ మంత్రులు 299 టీఎంసీలు సరిపోతాయని అంగీకరించారని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన 42 రోజులకే కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి తెలంగాణకు 299 టీఎంసీలకు మించి 580 టీఎంసీల నీళ్లు కేటాయించాలని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. కృష్ణా జలాల విషయంలో గత నిర్ణయాలు, ప్రస్తుత వినియోగ గణాంకాలు, ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# శ్రీశైల మల్లికార్జునుని దర్శించుకున్న ఎంపీ ఈటల

**శ్రీశైలం, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలంలోని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను ఎంపీ ఈటల రాజేందర్ దర్శించుకున్నారు. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, పంచాయతీరాజ్ శాఖ సహాయ మంత్రి ఎస్‌పీ సింగ్ బఘేల్‌తో కలిసి ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన శ్రీశైల మహాక్షేత్రంలో దైవదర్శనం చేసుకున్నారు. కార్తీక మాసంలో శివకేశవుల అనుగ్రహం కోసం దేశవ్యాప్తంగా భక్తులు పెద్ద సంఖ్యలో పుణ్యక్షేత్రాలకు తరలివస్తారు. ఈ నేపథ్యంలో కార్తీక పౌర్ణమి రోజున శ్రీశైలంలో భక్తుల ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ పవిత్ర సందర్భంలో ఈటల రాజేందర్, ఎస్‌పీ సింగ్ బఘేల్ స్వామివార్లను దర్శించుకుని ఆలయ సంప్రదాయాల ప్రకారం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

దర్శనానంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించారు. ఆలయ పవిత్రత, కార్తీక పౌర్ణమి విశిష్టత మధ్య స్వామి, అమ్మవార్ల ఆశీస్సులు పొందడం ఆనందంగా ఉందని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి దైవానుగ్రహం కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేశ ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, శాంతి, శ్రేయస్సు కలగాలని మల్లికార్జున స్వామివారిని, భ్రమరాంబికా అమ్మవారిని ప్రార్థించినట్లు ఈటల రాజేందర్ వెల్లడించారు. ప్రజలందరికీ మంచి జరగాలని, దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 25 - నవంబర్ 2026


# ఫుట్‌పాత్ లేక పాదచారుల నరకయాతన!



- **మల్లాపూర్ బ్రిడ్జి ఇరువైపులా ప్రమాదకర పరిస్థితులు..**
- **అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం..**

**మల్లాపూర్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** కాప్రా సర్కిల్ పరిధిలోని నాచారం డివిజన్ మల్లాపూర్ బ్రిడ్జి ఇరువైపులా ఫుట్‌పాత్ లేకపోవడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పక్కన కొద్ది దూరం నడవాలన్నా ప్రమాదకరంగా మారిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోని రహదారి పరిస్థితులను పరిశీలిస్తే పాదచారులకు నడిచేందుకు సరైన స్థలం లేకపోవడం, పెద్ద రాళ్లు, ఎగుడుదిగుడు నేల, దట్టంగా పెరిగిన వృక్షసంపద, రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన పండ్ల బండ్లు తదితర అడ్డంకులు ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి.

ప్రతిరోజూ వందలాది, వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిపై మలుపులు, టర్నింగ్ పాయింట్ల వద్ద పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. వాహనాలు అతి సమీపంలో నుంచి వెళ్తుండడంతో పాదచారులు అడ్డంకులను దాటుకుంటూ, ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని నడవాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, మహిళలు ఈ మార్గంలో ప్రయాణించాలంటే తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

ఈ రహదారిని ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం తరచుగా వినియోగిస్తున్నప్పటికీ, పాదచారుల సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సమస్యపై సంబంధిత అధికారులకు అవగాహన ఉన్నప్పటికీ, ఇప్పటివరకు తగిన చర్యలు చేపట్టకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, మున్సిపల్ అధికారులు స్పందించి పాదచారులకు సురక్షితమైన నడక మార్గాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**అభివృద్ధి అంటే ప్రాజెక్టుల సంఖ్య కాదు.. ప్రజలకు అందే ప్రయోజనం ముఖ్యం**

స్థానిక ప్రజల వివరాల ప్రకారం ఓ వయోవృద్ధుడు మాట్లాడుతూ.. పాదచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ.. అభివృద్ధి పనులను కేవలం చేపట్టిన ప్రాజెక్టుల సంఖ్యను బట్టి మాత్రమే అంచనా వేయకూడదని, వాటి నాణ్యత, సామాన్య ప్రజలకు కలిగే ప్రయోజనం కూడా నిర్ధారించుకోవాలని అభిప్రాయపడ్డారు. ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి ఈ మార్గంలో తరచుగా ప్రయాణిస్తున్నప్పటికీ, ప్రజలకు ప్రత్యక్షంగా కనిపిస్తున్న ఈ సమస్యపై ఎందుకు దృష్టి సారించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ ప్రాంతంలో ప్రముఖ సంఘసేవకుల విగ్రహాలు ఏర్పాటు చేసిన సెంటర్ వద్ద నాయకులు సందర్శానుసారంగా వచ్చి నివాళులర్పిస్తున్నారే తప్ప, అదే ప్రాంతంలో ఫుట్‌పాత్ లేక ప్రజలు ఎదుర్కొంటున్న రోజువారీ సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రజా భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పాలకులు, అధికారులు ఈ సమస్యను పట్టించుకోకపోవడం విచిత్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల తనిఖీలు.. సురక్షిత ఫుట్‌పాత్ ఏర్పాటు చేయాలి**

నాచారం డివిజన్ పరిధిలోని మల్లాపూర్ బ్రిడ్జి ఇరువైపులా నాచారం సర్కిల్ మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, పాదచారులకు ఆటంకంగా ఉన్న అడ్డంకులను తొలగించి, నిరంతరాయంగా ఉపయోగించుకునేలా ఫుట్‌పాత్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అదే సమయంలో ట్రాఫిక్ పోలీసులు తక్షణ భద్రతా చర్యలు చేపట్టి, ప్రమాదాలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**పాదచారుల డిమాండ్ ఒక్కటే.. సురక్షితమైన నడక మార్గం!**

రోడ్డు అనేది కేవలం వాహనాల రాకపోకలకే కాకుండా పాదచారులకు కూడా సురక్షితంగా ఉపయోగపడాలి. నివారించగల ప్రమాదాలు చోటుచేసుకుని ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకముందే సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, ఉప్పల్ ఎమ్మెల్యే తక్షణమే ఈ ప్రాంతాన్ని పరిశీలించి పాదచారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# చీకటోనిపల్లిలో గ్రామపంచాయతీ నూతన భవనానికి భూమిపూజ



**పెద్దమందడి,నవంబర్24(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం చీకటోనిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ముమ్మాల అశ్విత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.గ్రామ పరిపాలనకు,ప్రజలకు అందించే సేవలకు నూతన భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామి, వెల్టూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బలీదు పల్లి సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, రామచంద్రయ్య గౌడ్,డీలర్ శ్రీనివాసులు, వివేక్, బాజా శ్రీను, విక్రమ్ రెడ్డి,సర్పంచ్ భర్త రమేష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ చరిత్రను భావితరాలకు తెలియజేయాలి

- **నవంబర్ 29న అలుగునూరులో జరిగే దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలి– బోయినపల్లి వినోద్ కుమార్**



**ఇల్లంతకుంట, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష చారిత్రక ఘట్టమని, ఆ పోరాట స్ఫూర్తిని నేటి యువతకు, భావితరాలకు తెలియజేయాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.ఇల్లంతకుంట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నవంబర్ 29 దీక్షా దివస్ సభ ఏర్పాట్లపై నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందని, విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమంలో భాగస్వాములయ్యారని గుర్తుచేశారు. సకల జనుల సమ్మె, మిలియన్ మార్చ్, సాగరహారం వంటి ఉద్యమ కార్యక్రమాల అనంతరం 2014లో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందన్నారు.తెలంగాణ సాధన కోసం యువత చేసిన త్యాగాలు, ఉద్యమకారుల పోరాటాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, దీక్షా దివస్ ప్రాధాన్యతను ప్రతి ఇంటికి చేరవేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 29న సాయంత్రం 4 గంటలకు కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గంలోని అలుగునూరులో నిర్వహించనున్న దీక్షా దివస్ బహిరంగ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. పూర్వ కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, యువత, విద్యార్థులు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, తిరుపతి, నర్సయ్య, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ కుటుంబ భీమా పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి

- **16వ డివిజన్ మల్కాపూర్‌లో మార్నింగ్ వాక్**
- **ఇందిరమ్మ కుటుంబ భీమా పథకంపై కరపత్రాలు పంపిణీ చేసిన సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**



**కరీంనగర్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** అర్హులైన ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ కుటుంబ భీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి (కేఎన్ఆర్) కోరారు. పథకంలో నమోదు చేసుకునేందుకు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డుతో సమీపంలోని వార్డు కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

కేఎన్ఆర్ మార్నింగ్ వాక్‌లో భాగంగా 16వ డివిజన్ మల్కాపూర్‌లో స్థానిక కార్పొరేటర్ కాంతాల జగన్ రెడ్డి, నాయకులతో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ కుటుంబ భీమా పథకంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పథకంలో నమోదు చేసుకున్నారా లేదా అని స్థానికులను అడిగి తెలుసుకుని, నమోదు కానివారు వెంటనే వార్డు కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం గతంలో సుడా నిధులతో మంజూరైన మురుగుకాలువల నిర్మాణ పనులను పరిశీలించి, త్వరలో పనులు ప్రారంభిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. విలీన గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రపంచ మేయర్ల వేదికపై కరీంనగర్‌కు ప్రాతినిధ్యం.. మేయర్ కోలగాని శ్రీనివాస్‌కు ఆహ్వానం

- **ముంబైలో నవంబర్ 25, 26 తేదీల్లో 30 దేశాల మేయర్లతో అంతర్జాతీయ సదస్సు**
- **సదస్సులో కరీంనగర్ నగర అభివృద్ధి నమూనాను వివరించనున్న మేయర్**



కరీంనగర్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు): అంతర్జాతీయ స్థాయిలో కరీంనగర్ నగరానికి గుర్తింపు లభించే మరో అవకాశం దక్కింది. ముంబై వేదికగా నవంబర్ 25, 26 తేదీల్లో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక మూడో ప్రపంచ మేయర్ల సదస్సుకు కరీంనగర్ నగర మేయర్ కోలగాని శ్రీనివాస్‌కు ఆహ్వానం అందింది.

ముంబైలోని ఫెయిర్‌మాంట్ హోటల్‌లో రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సులో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 30 దేశాలకు చెందిన నగరాల మేయర్లు, వివిధ రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రులు, స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులు పాల్గొననున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

ఈ సదస్సులో భవిష్యత్ నగరాల నిర్మాణం, 2047 నాటికి భారత నగరాల పునర్నిర్మాణం, కృత్రిమ మేధస్సుతో పట్టణ నిర్వహణ, వ్యర్థాల సమస్య పరిష్కారం, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ పెట్టుబడులతో స్థానిక అభివృద్ధి వంటి కీలక అంశాలపై చర్చించనున్నారు. అలాగే సురక్షిత నగరాల నిర్మాణం, నదీ తీర నగరాల అభివృద్ధి, ప్రజా రవాణా వ్యవస్థ, కాలుష్య రహిత మౌలిక సదుపాయాలు, వాతావరణ మార్పుల సవాళ్లు, మహానగర పాలన బలోపేతంపై రెండో రోజు చర్చలు జరగనున్నాయి.

ఈ అంతర్జాతీయ వేదికపై కరీంనగర్ నగర అభివృద్ధి నమూనాను వివరించడంతో పాటు, ప్రపంచంలోని వివిధ నగరాల్లో అమలవుతున్న అత్యుత్తమ అభివృద్ధి విధానాలను అధ్యయనం చేసేందుకు ఈ సదస్సు అవకాశం కల్పించనుంది. అంతర్జాతీయ స్థాయి సదస్సుకు కరీంనగర్ మేయర్‌కు ఆహ్వానం అందడం నగర అభివృద్ధి అంశాలకు ప్రపంచ వేదికపై ప్రాతినిధ్యం కల్పించే అవకాశంగా నిలవనుంది.

# కూతురు న్యాయవాదిగా ఎదగడం సంతోషంగా ఉంది

- **తల్లిదండ్రుల భావోద్వేగం**



**పెద్దమందడి,నవంబర్24(తెలంగాణ ముచ్చట్లు):** తమ కుమార్తె ముప్పూరి నిహారిక పట్టుదలతో చదివి న్యాయవాదిగా ఎదగడం ఎంతో సంతోషంగా, గర్వంగా ఉందని వనపర్తి జిల్లా పెద్దమందూరు మండలం మణిగిల్ల గ్రామానికి చెందిన ముప్పూరి సురేష్, అరుణ దంపతులు భావోద్వేగం వ్యక్తం చేశారు. చిన్నప్పటి నుంచే చదువుపై ఆసక్తి చూపిన నిహారికను ఉన్నత చదువులు చదివించాలనే ఉద్దేశంతో తాము ఎన్నో కష్టాలు పడుతూ ప్రోత్సహించామని తెలిపారు. తమ కష్టానికి తగిన ఫలితంగా నిహారిక న్యాయవిద్యలో నిలవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. హైదరాబాద్‌లో న్యాయవాద విద్యను అభ్యసించిన నిహారిక, హైదరాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేసి, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో తన పేరును నమోదు చేసుకుని, అనంతరం వనపర్తి కోర్టులో న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టిందని తెలిపారు. కూతురు ఈ స్థాయికి చేరుకోవడం తమ జీవితంలో మరిచిపోలేని సందర్భమని, ఆమె విజయం వెనుక తమ ప్రోత్సాహంతో పాటు బాబాయ్, ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పురుషోత్తం అందించిన మార్గదర్శనం కూడా ఎంతో ఉందని పేర్కొన్నారు. నిహారిక చిన్ననాటి నుంచి చదువు కోసం పడిన కష్టాలు, లక్ష్యాన్ని చేరుకోవడానికి చేసిన ప్రయత్నాలు గుర్తుకొస్తుంటే ఆనందంతో మనసు నిండిపోతోందని అన్నారు. ఆడపిల్లలకు మంచి విద్య అందించి ప్రోత్సహిస్తే వారు కూడా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని, తమ కుమార్తె విజయం ఇందుకు నిదర్శనమని సురేష్, అరుణ దంపతులు సంతోషం వ్యక్తం చేశారు. నిహారిక భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, పేదలకు న్యాయం అందించే మంచి న్యాయవాదిగా పేరు సంపాదించాలని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ ఎస్సీ సెల్ బలోపేతంపై కీలక సమావేశం

- **గట్టు మన్నెం, పెద్దమందడి మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు**



**పెద్దమందడి,నవంబర్24(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు పెద్దమందడి మండలంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ బలోపేతం, కమిటీ కార్యకలాపాలపై చర్చించేందుకు నేడు మండల స్థాయి ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు గట్టు మన్నెం తెలిపారు.మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్ము వెంకటస్వామి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలో ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజ్ కుమార్, మండల ఇన్‌చార్జి శ్రీహరి రాజు హాజరు కానున్నారు.ఈ సమావేశంలో ఎస్సీ సెల్ కమిటీ బలోపేతం, పార్టీ కార్యక్రమాల్లో కమిటీ సభ్యుల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చించనున్నారు. కావున మండల పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ సెల్ మండల కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని గట్టు మన్నెం కోరారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పట్టుదలతో చదివి న్యాయవాదిగా ఎదిగిన ముప్పూరి నిహారిక



**పెద్దమందడి,నవంబర్24(తెలంగాణ ముచ్చట్లు):** పట్టుదల, కష్టపడే తత్వం, చదువుపై ఆసక్తి ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని నిరూపించారు వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామానికి చెందిన ముప్పూరి సురేష్, అరుణ దంపతుల కుమార్తె ముప్పూరి నిహారిక. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఆమె కష్టపడి చదివి న్యాయవాదిగా ఎదిగి తన గ్రామానికి గుర్తింపు తీసుకొచ్చారు.నిహారిక హైదరాబాద్ హైకోర్టులో అడ్వకేట్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో తన పేరును నమోదు చేసుకుని వనపర్తి కోర్టులో న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టారు.చదువుకునే సమయంలో ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ, లక్ష్యంపై దృష్టి సారించి న్యాయవిద్యను విజయవంతంగా పూర్తిచేశారు. ఈ ప్రయాణంలో తల్లిదండ్రులు ముప్పూరి సురేష్, అరుణ అందించిన ప్రోత్సాహంతో పాటు ఆమె బాబాయ్, ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పురుషోత్తం అందించిన ప్రోత్సాహం, మార్గదర్శనం కూడా నిహారిక విజయానికి తోడ్పడ్డాయి. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, సహకారంతోనే న్యాయవాదిగా తన లక్ష్యాన్ని చేరుకోగలిగానని నిహారిక సంతోషం వ్యక్తం చేశారు.మణిగిల్ల గ్రామానికి చెందిన యువతి న్యాయవాదిగా ఎదిగి వనపర్తి కోర్టులో బాధ్యతలు చేపట్టడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమె సాధించిన విజయాన్ని అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. నిహారిక విజయం గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థినులకు స్ఫూర్తిగా నిలుస్తూ, పట్టుదలతో చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చనే సందేశాన్ని ఇస్తోంది.

# వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక శిబిరం

- **అర్హులైన వారందరికీ అవసరమైన పరికరాల పంపిణీకి ప్రత్యేక శిబిరం**
- **వంగర గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన రమేష్**



**భీమదేవరపల్లి, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** భీమదేవరపల్లి మండలంలోని అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు సహాయ పరికరాలు అందించేందుకు ఈ నెల 27వ తేదీన శుక్రవారం ముల్కనూరులోని శ్రీసాయి గార్డెన్స్‌లో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు వంగర గ్రామ సర్పంచ్ గజ్జెల సృజన రమేష్ తెలిపారు.

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ శిబిరంలో అర్హులైన వృద్ధులు, దివ్యాంగులకు వారి అవసరాలకు అనుగుణంగా సహాయ పరికరాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వృద్ధాప్యం, వైకల్యం కారణంగా రోజువారీ జీవితంలో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించి, వారు ఇతరులపై ఆధారపడకుండా ఆత్మగౌరవంతో జీవించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. కావున భీమదేవరపల్లి మండలంలోని అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన పత్రాలతో శిబిరానికి హాజరుకావాలని సర్పంచ్ గజ్జెల సృజన రమేష్ కోరారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి గ్రామ ప్రజాప్రతినిధులు, అధికారులు, సంబంధిత సిబ్బంది సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# టీపీసీసీ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ ఆదిత్య రెడ్డి



**వనపర్తి,నవంబర్24(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రానికి నూతన ఇన్‌చార్జిగా నియమితులైన బి.ఎం. సందీప్ జీ నాయకత్వంలో నిర్వహించిన టీపీసీసీ ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్ సమావేశంలో రాష్ట్ర ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపిసి) అధ్యక్షులు, వనపర్తి నియోజకవర్గ యువ నాయకులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏఐపీసీ సంస్థాగత బలోపేతం, రాష్ట్రవ్యాప్తంగా సంస్థ విస్తరణ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో ప్రొఫెషనల్స్ భాగస్వామ్యం, యువతకు రాజకీయాల్లో అవకాశాల కల్పన వంటి కీలక అంశాలపై చర్చించారు.వివిధ వృత్తులకు చెందిన నిపుణులను కాంగ్రెస్ పార్టీతో అనుసంధానం చేస్తూ, వారి నైపుణ్యాలు, ఆలోచనలు, అనుభవాలను ప్రజాసేవకు వినియోగించుకోవాల్సిన అవసరాన్ని సమావేశంలో ప్రస్తావించారు. ఏఐపీసీ విభాగాన్ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా సంస్థ కార్యకలాపాలను విస్తరించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై డాక్టర్ ఆదిత్య రెడ్డి తన అభిప్రాయాలను వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఏఐపీసీ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడానికి, రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి పేర్కొన్నారు.

# 'సంకల్పం' ఆనందం ఆకాశమంత..

- **ప్రకృతితో మమేకమైతేనే జీవన విలువలు మెరుగుపడుతాయి**
- **ఏఆర్ ఏసీపీ నర్సయ్య**
- **తలసేమియా చిన్నారుల వనభోజనాలలో సందడి**



**ఖమ్మం బ్యూరో , నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** తలసేమియా చిన్నారుల మల్లె పూల లాంటి చిరునవ్వుల ముందు ప్రకృతి సోయగాలు సైతం కళ్లు చెదిరిపోయాయని.. ఈ వేడుకలతో సంకల్ప సంస్థ ఆనందం ఆకాశాన్ని అంటిందని ఏఆర్ ఏసీపీ నర్సయ్య అన్నారు. ఖమ్మం నగరంలోని గొల్లగూడెం రోడ్డులో గల చెరుకూరి వారి మామిడి తోటలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారులకు నిర్వహించిన కార్తీక మాస వనభోజనాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నారులు ఆడిపాడారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. అనంతరం సంకల్ప సంస్థ ఫౌండర్ పి.అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏసీపీ నర్సయ్య మాట్లాడుతూ కార్తీక మాసంలో అందరూ కలిసి ఆటపాటలు ఆడుకుంటూ, భక్తిభావంతో పూజలు చేసేందుకే వనభోజనాలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రకృతితో ఒకసారి మమేకమైతే మన జీవనం గతం నుంచి ఇప్పటివరకు ఎలా సాగిందో తెలుస్తుందని, పర్యావరణాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశం ఇందులో దాగి ఉంటుందని వివరించారు. ఉసిరి చెట్టును లక్ష్మీదేవి స్వరూపంగా భావించి దాని కింద వనభోజనాలు చేయడం మన సంప్రదాయమని తెలిపారు. ఆటపాటలు, భజనలు, ఆనందోత్సాహాల నడుమ సాగిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఓలివ్ క్రిష్టో సిస్టమ్స్ సంస్థ అధినేత జి. భారవి మాట్లాడుతూ సంకల్ప సంస్థతో తన ప్రయాణం 12 సంవత్సరాల క్రితం ప్రారంభమైందని, చిన్నారులకు సేవ చేసేందుకు ఆ ప్రయాణం కొనసాగుతుందన్నారు. సంస్థ ఫౌండర్ పి.అనిత మాట్లాడుతూ ఓలివ్ క్రిష్టో సిస్టమ్ అధినేత భారవి సహకారంతో తలసేమియా చిన్నారులకు మందులతో పాటు ఐరన్ చిలేషన్ ఇంజక్షన్ల కోసం మిషన్లను సమకూర్చుకోగలిగామని తెలిపారు. 12 ఏళ్లుగా చిన్నారులకు సేవలందించేందుకు సహకారం అందిస్తున్నారని, తలసేమియా చిన్నారుల కోసం బ్లడ్ బ్యాంక్ ఏర్పాటులో అండగా నిలబడ్డారన్నారు. హైదరాబాద్ కార్యాలయంలో తమ సంస్థ ఉద్యోగుల ద్వారా రక్తదానం చేయిస్తున్నారని కొనియాడారు. ఇటువంటి దాతల సహకారంతోనే చిన్నారులు నిశ్చింతగా జీవిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డి.నారాయణ మూర్తి, ఓలివ్ క్రిష్టో సిస్టమ్స్ సంస్థ బాధ్యులు సుజాత, సంకల్ప సంస్థ కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యక్షురాలు పి.పావని, ఉదయ్ భాస్కర్, రవిచందర్, ఎన్.ఉపేందర్, కస్తూరి, క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పశ్చిమలో రాజకీయ దుమారం.. బీఆర్ఎస్ మెరుపు ధర్నా!





- **నాయిని క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం.. పోలీసుల స్వల్ప లాఠీచార్జి**
- **సవాళ్లు.. ప్రతిసవాళ్లతో వేడెక్కిన రాజకీయం.. బీఆర్ఎస్ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం**
- **ప్రతిఆందోళనకు కాంగ్రెస్ శ్రేణుల సన్నద్ధత?**

**హనుమకొండ, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** సవాళ్లు.. ప్రతిసవాళ్లు.. నిరసనలు.. ప్రతినిరసనలతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మధ్య సాగుతున్న రాజకీయ విమర్శలు ఇప్పుడు వీధి పోరాటాలకు దారితీశాయి. సోమవారం ఇరువురు నేతలు పరస్పరం విసురుకున్న సవాళ్ల నేపథ్యంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే నాయిని క్యాంపు కార్యాలయం ముట్టడికి ప్రయత్నించడం ఉద్రిక్తతకు కారణమైంది. క్యాంపు కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు బైఠాయించి నిరసనకు దిగడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఆందోళనకారులను అదుపు చేసే క్రమంలో స్వల్ప లాఠీచార్జి జరగడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది.

**కేటీఆర్ పోటీపై నాయిని సవాల్.. వినయ్ భాస్కర్ ప్రతిసవాల్**

ఈ వివాదానికి సోమవారం జరిగిన రాజకీయ సవాళ్లే ప్రధాన కారణంగా నిలిచాయి. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సవాల్ విసరగా, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఘాటుగా స్పందించారు. నాయినికి దమ్ముంటే తన పదవికి రాజీనామా చేయాలని, ఉప ఎన్నికలో తాను పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు.



దీనిపై స్పందించిన నాయిని రాజేందర్‌రెడ్డి సోమవారం సాయంత్రం ఐదు గంటలకు హనుమకొండ చౌరస్తాకు రావాలని వినయ్ భాస్కర్‌కు ప్రతిసవాల్ విసిరారు. గత పదేళ్లలో వినయ్ భాస్కర్ చేపట్టిన అభివృద్ధి పనులు, తన హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించారు. దీంతో ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరి, ఇరు పార్టీల కార్యకర్తల మధ్య రాజకీయ వేడి పెరిగింది.

**క్యాంపు కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ బైఠాయింపు**

సోమవారం నేతల మధ్య జరిగిన సవాళ్లకు నిరసనగా మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి సమీపంలోనే ఉన్న బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయం నుంచి ఒక్కసారిగా బయటకు వచ్చిన నాయకులు, కార్యకర్తలు క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించారు. నాయిని రాజేందర్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలని, విసిరిన సవాళ్లపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆందోళనకారులు క్యాంపు కార్యాలయం వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు స్వల్ప లాఠీచార్జి చేశారు. పలువురు నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లకు తరలించినట్లు సమాచారం. దీంతో కొంతసేపు క్యాంపు కార్యాలయం పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

**ప్రతిఆందోళనకు కాంగ్రెస్ శ్రేణుల సన్నద్ధత?**

బీఆర్ఎస్ చేపట్టిన ఆందోళనతో రాజకీయ వివాదం మరో మలుపు తిరిగింది. బీఆర్ఎస్ నిరసనకు ప్రతిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు కూడా ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే వరంగల్ పశ్చిమలో ఇరు పార్టీల మధ్య రాజకీయ పోరు మరింత బహిరంగంగా మారే అవకాశం ఉంది.

ఇప్పటికే అభివృద్ధి పనులు, రాజకీయ ప్రాతినిధ్యం, నాయకుల పనితీరుపై పరస్పర విమర్శలు చేసుకుంటున్న ఇరు పార్టీల నేతలు ఇప్పుడు నిరసనలు, ప్రతినిరసనల బాట పట్టడం చర్చనీయాంశంగా మారింది. ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చ జరగాల్సిన రాజకీయ వేదికలు నిరసనలకు కేంద్రాలుగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మొత్తంగా నాయిని రాజేందర్‌రెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్ మధ్య మొదలైన సవాళ్ల పర్వం బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య ఉద్రిక్తతలకు దారితీసింది. రానున్న రోజుల్లో ఇరు పార్టీలు ఎలాంటి కార్యాచరణ చేపడతాయి? బహిరంగ చర్చకు నేతలు ముందుకొస్తారా? లేక నిరసనలు, ప్రతినిరసనలతో రాజకీయ వేడి కొనసాగుతుందా? అన్నది వరంగల్ పశ్చిమ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

# కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో వైభవంగా ఆకాశ దీపోత్సవం

- **కార్తీక పౌర్ణమి సందర్భంగా ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపం.. కోనేటి వద్ద దీపారాధన**



**భీమదేవరపల్లి,నవంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక దీపారాధన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రదోష వేళలో స్వామివారి ధ్వజస్తంభం వద్ద దేవస్థానం ఆధ్వర్యంలో ఆకాశ దీపాన్ని ఏర్పాటు చేయగా, కోనేటి వద్ద ప్రత్యేక దీపారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దీపాలలో నూనె పోసి తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ ప్రాంగణం దీపాల వెలుగులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఈ కార్యక్రమంలోకార్యనిర్వహణ అధికారి పి. కిషన్ రావు, అధిక సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు, అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 25 - నవంబర్ 2026




## నేతాజీ నగర్, శివశక్తి వాసులతో మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

**కాప్రా,నవంబర్24(తెలంగాణ ముచ్చట్లు):**కాప్రా సర్కిల్ పరిధి చర్లపల్లి డివిజన్ లోని నేతాజీ నగర్,శివసాయి నగర్ కాలనీ పెద్దలు ఈగ యాదగిరి నివాసంలో కాలనీ వాసులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీ ప్రజలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, కాలనీలోని సమస్యలపై జరుగుతున్న పనులను త్వరగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఎల్ల వేళల కాలనీ అభివృద్ధికి కృషి చేస్తూ, తమ సమస్యలపై సానుకూలంగా స్పందించినందుకు కాలనీ ప్రజలు,నాయకులు మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ ని శాలువాతో ఘనంగా సత్కరించి, తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు, మహిళల కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ మొరం తరలింపుపై పోలీసుల కొరడా!

- కేశవనగర్ శివారులో అనుమతులు లేకుండా మొరం రవాణా
- పెట్రోలింగ్‌లో పట్టుబడిన టిప్పర్.. వాహనం స్వాధీనం, కేసు నమోదు

**ధర్మసాగర్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ధర్మసాగర్ సీఐ అనుముల శ్రీనివాస్ హెచ్చరించారు. అక్రమ మొరం రవాణాకు పాల్పడుతున్న టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.సీఐ అనుముల శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం తెల్లవారుజామున ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేశవనగర్ గ్రామ శివారులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, ఎలాంటి అనుమతులు లేకుండా టిప్పర్‌లో మొరం తరలిస్తున్నవ్యక్తిని గుర్తించారు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకుని, మొరం తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ ఘటనపై ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఏఎస్సై సైదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా మొరం, ఇతర ఖనిజ సంపదను అక్రమంగా తరలించే వారిపై నిరంతరం నిఘా ఉంచుతామని, ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ అనుముల శ్రీనివాస్ స్పష్టం చేశారు.



## చర్లపల్లిలో ఉచిత యోగా శిబిరానికి విశేష స్పందన

- ప్రొఫెసర్ జయశంకర్ పార్కులో కొనసాగుతున్న యోగా తరగతులు..

**చర్లపల్లి,నవంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** స్వామి రాందేవ్ బాబా ఆశీస్సులతో భారత్ స్వాభిమాన్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో మంగళవారం హరినాథరావు గురూజీ సారథ్యంలో చర్లపల్లి పారిశ్రామిక ప్రాంతంలోని ప్రొఫెసర్ జయశంకర్ పార్కులో నిర్వహిస్తున్న ఉచిత యోగా శిబిరం రెండో రోజు విజయవంతంగా కొనసాగింది. శిబిరానికి సాధకుల నుంచి విశేష స్పందన లభిస్తోందని నిర్వాహకులు తెలిపారు. అనుభవజ్ఞులైన యోగా గురువులు యోగా శిక్షకుల బృందం యోగ గురువు టి రామ్ శెట్టి, యువ ప్రబారి యోగ గురువు బలరాం రెడ్డి, సహ ప్రబారి యోగ గురువు వీరేశం పాల్గొని పలువురికి యోగాసనాలు, ప్రాణాయామంపై శిక్షణ అందిస్తున్నారు. స్థానిక నాయకులు, అధికారుల నుంచి కూడా శిబిరానికి ప్రశంసలు లభించాయి. ఈ ఉచిత యోగా తరగతులు మరో ఏడు రోజులపాటు ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు కొనసాగనున్నాయి. ఆసక్తి కలిగిన స్త్రీ, పురుషులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమాన్ని ఆర్గనైజింగ్ సెక్రటరీ పుప్పాల లక్ష్మీకాంతయ్య పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.

# మాదిగ ఉపకులాల వనభోజనాలను విజయవంతం చేయాలి

- నవంబర్ 29న హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లో అలై బలై కార్యక్రమం
- పిలుపునిచ్చిన బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్
- ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కరపత్రాల ఆవిష్కరణ



**హైదరాబాద్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** మాదిగ ఉపకులాల ఐక్యత, సామాజిక సమైక్యతను చాటిచెప్పేలా నవంబర్ 29న నిర్వహించనున్న వనభోజనాల అలై బలై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్ పిలుపునిచ్చారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి అధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి మాదిగ ఉపకులాల నాయకులు, విద్యార్థులు, మేధావులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.మాదిగ విద్యార్థి ఐక్య కార్యాచరణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు జోగు గణేష్ అధ్వర్యంలో నిర్వహించిన కార్తీకమాస వనభోజన కార్యక్రమానికి బోరెల్లి సురేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ ఉపకులాల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు పరస్పర స్నేహభావం, ఆత్మీయతను పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని అన్నారు.నవంబర్ 29న ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో మాదిగ ఉపకులాల వనభోజనాలు, అలై బలై కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ విద్యార్థిని ఐక్య కార్యాచరణ సమితి నాయకుడు దేవరకొండ నరేష్, రాష్ట్ర కన్వీనర్ మీసాల మహేష్, బీఎస్ఎఫ్ ఉస్మానియా విశ్వవిద్యాలయ అధ్యక్షుడు కల్వకుర్తి శ్రీశైలం, ఉపాధ్యక్షుడు ఆరెకంటి శ్రీకాంత్, నాయకులు డి. ఓంకార్, దేవర పాగ నాగరాజు, సతీష్, ఉపేందర్, రాజగోపాల్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మర్రిచెట్టు శివాలయంలో వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు.. 365 వత్తులతో దీపారాధన
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు



**ఘనపూర్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఘనపూర్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ మర్రిచెట్టు శివాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించడంతో పాటు 365 వత్తులతో దీపారాధన చేశారు. ఆలయ ప్రాంగణం భక్తుల శివనామస్మరణతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.కార్తీక మాసం శివారాధనకు విశేష ప్రాధాన్యత కలిగిన పవిత్ర మాసం కావడంతో నెల రోజుల పాటు భక్తులు ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం తమ ఇళ్లలో దీపాలు వెలిగిస్తూ, ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. కార్తీక పౌర్ణమి రోజున 365 వత్తులతో దీపారాధన చేయడం ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యతను సంతరించుకుంది.మర్రిచెట్టు శివాలయంలో పూజారులు రామలింగశర్మ, ప్రవీణ్ శర్మ, శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఘనపూర్ మున్సిపల్ కమిషనర్ బండ్ల రాధాకృష్ణ, అరుణకుమారి దంపతులు, కొలిపాక సునీత సతీష్ దంపతులు, గట్టు సుకన్య, రంజిత్, గట్టు రజిత, కుమారస్వామి, గణేష్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

# హనుమకొండ జిల్లాలో విజయవంతమైన పల్స్ పోలియో





- నిర్దేశిత లక్ష్యాన్ని మించి 100.2 శాతం ప్రగతి
- 84,816 మంది చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ
- వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి అభినందనలు తెలిపిన జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణారావు

**హనుమకొండ, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మూడు రోజుల పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. నిర్దేశించిన లక్ష్యానికి మించి చిన్నారులకు పోలియో చుక్కలు వేసి 100.2 శాతం ప్రగతిని సాధించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 84,816 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయగా, నిర్దేశిత లక్ష్యం 84,654 మంది కావడం విశేషం.
మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా చివరి రోజు ఇంటింటి సర్వే, పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణారావు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లోని ప్రయాణ మార్గ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న తీరును పరిశీలించారు. కార్యక్రమ పర్యవేక్షణకు నియమించిన అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో పర్యటిస్తూ ఇంటింటి సర్వే, పోలియో చుక్కల పంపిణీని సమీక్షించారు.మూడవ రోజు నిర్వహించిన కార్యక్రమంలో మరో 416 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 75,387 ఇళ్లను సందర్శించి ఇంటింటి సర్వే నిర్వహించారు. మూడు రోజుల పాటు వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయడంతో నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించగలిగారు.ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ.. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమన్నారు. ఇతర శాఖల అధికారులు, సిబ్బంది సహకారం కూడా కార్యక్రమ విజయానికి దోహదపడిందని తెలిపారు.అన్ని శాఖల సమన్వయం, సిబ్బంది అంకితభావం, సమిష్టి కృషి వల్లే నిర్దేశించిన లక్ష్యాన్ని మించి 100.2 శాతం ప్రగతి సాధించగలిగామని పేర్కొన్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కుత్బుల్లాపూర్ డీఎంహెచ్ఓలో ఆకస్మిక తనిఖీలు

- ఎస్ఎస్ఐడీ మాప్-అప్ డేలో ఇంటింటి సర్వే పరిశీలన..
- మిగిలిన చిన్నారులకు పోలియో టీకాలు..
- జిల్లా జిల్లా వైద్య అండ్ ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్



**మేడ్చల్,నవంబర్24 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా జిల్లా వైద్య అండ్ ఆరోగ్య అధికారి డా. కె. ఆనంద్ కుత్బుల్లాపూర్‌లోని యూపీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీలో నిర్వహిస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, సంబంధిత రికార్డుల్లోని వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదైన సమాచారంతో సరిపోల్చి ధృవీకరించారు. అనంతరం సబ్ నేషనల్ ఇమ్యునైజేషన్ డే -పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న మాప్‌అప్ డే కార్యక్రమాన్ని పరిశీలించారు. కుత్బుల్లాపూర్‌లోని గార్డెన్ బస్తీ ప్రాంతంలో చేపట్టిన ఇంటింటి సర్వే ను స్వయంగా పరిశీలించిన డీఎంహెచ్ఓ, సర్వే ద్వారా గుర్తించిన పోలియో టీకా తీసుకోని మిగిలిన చిన్నారులకు ఓరల్ పోలియో వ్యాక్సిన్ (ఓపివి)చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వేను పూర్తిస్థాయిలో నిర్వహించి, ఒక్క చిన్నారి కూడా టీకాకు దూరం కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి డా. కె. ఆనంద్ సూచించారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

# కోళ్ల ఫారం నిర్వాహకుల నిర్లక్ష్యం.. రైతు బర్రె దూడపై కుక్కల దాడి

**వేలేరు నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు ):** హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామంలో కోళ్ల ఫారం నిర్వాహకుల నిర్లక్ష్యం రైతులకు ఇబ్బందులు కలిగిస్తోంది. గ్రామానికి చెందిన గొల్లేనా రాజయ్యకు సంబంధించిన కోళ్ల ఫారంలో మృతి చెందిన కోళ్లను అక్కడే ఉన్న బట్టల బోడి గుట్ట సమీపంలోని కుంటలో వేస్తుండటంతో వాటిని తినేందుకు కుక్కలు గుంపులుగా చేరుతున్నాయి. ఈ క్రమంలో సమీపంలోని వ్యవసాయ బావుల వద్ద ఉన్న రైతు పోలు రాజుకు చెందిన బర్రె దూడపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన కోళ్లను జనావాసాలకు, వ్యవసాయ భూములకు సమీపంలో పడేయడం వల్ల పశువులకు ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సంబంధిత అధికారులు స్పందించి కోళ్ల ఫారం నిర్వాహకులపై చర్యలు తీసుకోవడంతో పాటు, మృత కోళ్లను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా తగిన చర్యలు చేపట్టాలని చుట్టుపక్కల రైతులు కోరుతున్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# కాంగ్రెస్ పింఛన్లను కేసీఆర్ ఖాతాలో వేయడం సిగ్గుచేటు!

- **ప్రజలను తప్పదోవ పట్టించే రాజకీయాలు మానుకోవాలి**
- **కౌశిక్ రెడ్డికి కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక**

**జమ్మికుంట, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులైన పేదలకు మంజూరు చేస్తున్న నూతన పింఛన్లను గతంలో కేసీఆర్ ప్రభుత్వం అందించినవిగా ప్రచారం చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ నాయకులు తీవ్రస్థాయిలో విమర్శించారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూడటం మానుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి హితవు పలికారు.

మంగళవారం జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్స్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ ప్రచార కమిటీ సభ్యుడు సాయిని రవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ అర్హులైన నిరుపేదలకు నూతన పింఛన్లు మంజూరు చేస్తోందని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రతి కుటుంబానికి ప్రమాద బీమా పథకాన్ని అందించే దిశగా కూడా చర్యలు చేపడుతోందని తెలిపారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తప్పుడు ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చూడటం సరికాదన్నారు. ప్రజలకు ఎవరు సంక్షేమ పథకాలు అందిస్తున్నారో, ఎవరి హయాంలో కొత్త పింఛన్లు మంజూరవుతున్నాయో స్పష్టంగా తెలుసని పేర్కొన్నారు. వాస్తవాలను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాలు పొందాలనే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తమ ఘనతగా చెప్పుకోవడం మానుకోవాలని కౌశిక్ రెడ్డిని హెచ్చరించారు.

ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకరి రమేష్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వీరమనేని పరశురామారావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు దొగ్గల భాస్కర్, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి దొడ్డే శ్రీకాంత్, మున్సిపల్ కాంగ్రెస్ కౌన్సిలర్లు ఒగ్గు రమేష్, పొనగంటి విష్ణు, ఎగిత అశోక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు గడ్డం దీక్షిత్, మానుపాటి సూర్య, పొనగంటి మధు, పూరెల్ల రాకేష్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలీం, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు రాచపల్లి సాగర్, పర్లపల్లి నాగరాజు, సజ్జు, పంజాల అజయ్, పాత ప్రసాద్, యాదవ సంఘం మండల అధ్యక్షుడు గిరవేన శ్రీనివాస్, కొలుగురు రవి, తిరుపతి రెడ్డి, వేల్పుల ప్రశాంత్, గుల్లి జెహనీయా, టింకరాల కిషోర్, రాకేష్, గుర్రపు ప్రవీణ్, రాసపెల్ అశ్విన్, కొలుగురి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ జల ప్రయోజనాలను గత పాలకులు ఏపీకి తాకట్టు పెట్టారు





- **578 టీఎంసీల వాటా రావాల్సి ఉండగా 298 టీఎంసీలకే అంగీకరించారు**
- **తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు మళ్లీ కదలిక తీసుకొచ్చాం**
- **బీఆర్ఎస్ పాలకులపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర విమర్శలు**

**ఖమ్మం, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటాను గత బీఆర్ఎస్ పాలకులు ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేసి రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. స్వప్రయోజనాల కోసం తెలంగాణ సాగునీటి ప్రయోజనాలను తాకట్టు పెట్టారని మండిపడ్డారు. మంగళవారం పాలేరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన ఆయన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండాలో 25, 26, 27, 28 వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అసంతరం ఏర్పాటు చేసిన



సభలో ఆయన మాట్లాడారు.

**578 టీఎంసీలకు బదులు 298 టీఎంసీలేనా?**

2005లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో మంత్రులుగా ఉన్న హరీశ్‌రావు తదితరులు కృష్ణా జలాల్లో తెలంగాణకు 578 టీఎంసీల వాటా రావాల్సి ఉండగా, కేవలం 298 టీఎంసీల నీళ్లు సరిపోతాయని అంగీకరించారని పొంగులేటి ఆరోపించారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టు సామర్థ్యాన్ని 11 వేల క్యూసెక్కుల నుంచి 40 వేల క్యూసెక్కులకు పైగా పెంచినా గత పాలకులు తగిన విధంగా స్పందించలేదని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం, పల్నాడు నీటి మళ్లింపు పథకాలకు కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అవకాశం కల్పించారని ఆరోపించారు.

**తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై మళ్లీ కదలిక**

తొమ్మిదిన్నరేళ్ల పాటు అధికారంలో ఉన్న గత పాలకులు కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రయోజనాలను విస్మరించారని మంత్రి విమర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మహారాష్ట్ర ప్రభుత్వం తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తును 145 అడుగుల నుంచి 148 అడుగులకు పెంచుకుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కేంద్ర మంత్రి, ప్రధానితో పాటు మహారాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసి ప్రాజెక్టు అంశంపై చర్చించామని, నిలిచిపోయిన ఫైల్‌కు మళ్లీ కదలిక తీసుకొచ్చామని వెల్లడించారు.

**ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వ ప్రాధాన్యం**

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ సాగునీటి ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని పొంగులేటి స్పష్టం చేశారు. గత పాలకుల వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు హరీశ్‌రావు, కేటీఆర్, కేసీఆర్ తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ నీటి ప్రయోజనాల విషయంలో ఎక్కడా రాజీపడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు ఎవరు విఘాతం కలిగించారో ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, కాంగ్రెస్ పార్టీ ఏదులాపురం అధ్యక్షుడు బానోత్ కిషోర్ నాయక్, స్థానిక కౌన్సిలర్లు దివ్య, నవీన్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదల సేవే ఏసుక్రీస్తు బోధించిన మార్గం

- **ప్రతి ఒక్కరిపై ప్రభువు ఆశీస్సులు ఉండాలి**
- **కల్వరి మినిస్ట్రీస్ ఉజ్జీవ సువార్త స్వస్థత సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**ఖమ్మం, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** పేదలకు సేవ చేయడం, నిరుపేదలకు అండగా నిలవడం, నిరక్షరాస్యులకు విద్యాబుద్ధులు నేర్పించడం వంటి సేవా మార్గాలనే ఏసుక్రీస్తు బోధించారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఏసుక్రీస్తు ఆశీస్సులు, దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో మంగళవారం రాత్రి నిర్వహించిన కల్వరి మినిస్ట్రీస్ ఉజ్జీవ సువార్త స్వస్థత సభలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు, విశ్వాసులతో ముచ్చటిస్తూ ఏసుక్రీస్తు బోధనలు, సేవా భావం గురించి మాట్లాడారు. ఏసుక్రీస్తు చూపిన ప్రేమ, కరుణ, సేవా మార్గాలు సమాజానికి ఆదర్శమని మంత్రి పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం కూడా పేదలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన వారి గడప వద్దకే చేరవేస్తోందని తెలిపారు.



సమాజంలోని బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని, సంతోషాన్ని కలిగిస్తుందని పేర్కొన్న మంత్రి, ప్రతి ఒక్కరూ ప్రేమ, సేవ, సోదరభావంతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ ఏనుగు మహేష్‌తో పాటు పలువురు క్రైస్తవ మత పెద్దలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు

- **ఈ నెల 26న అచ్చంపేటలో పంపిణీకి శ్రీకారం చుట్టనున్న సీఎం రేవంత్‌రెడ్డి**
- **చిలుకపచ్చ రంగులో ఆకర్షణీయమైన చీరలు.. నేత కార్మికులకు ఉపాధి**
- **రేషన్ కార్డు కలిగిన 18 ఏళ్లు నిండిన మహిళలకు పంపిణీ**



**హైదరాబాద్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 26న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం రెండోసారి మహిళలకు చీరలను కానుకగా అందించేందుకు సిద్ధమైంది.

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని 65 లక్షల మంది మహిళలకు, పట్టణ ప్రాంతాల్లోని 35 లక్షల మంది మహిళలకు కలిపి మొత్తం కోటి చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. మహిళల అభిరుచులకు అనుగుణంగా ఆకర్షణీయమైన చిలుకపచ్చ రంగులో చీరలను ప్రత్యేకంగా రూపొందించారు. నాణ్యత, మన్నికకు ప్రాధాన్యతనిస్తూ ఆధునిక రూపకల్పనతో పాటు సంప్రదాయ పద్ధతిలో ధరించేందుకు వీలుగా రెండు రకాల చీరలను సిద్ధం చేశారు.

**రెండు రకాల చీరల తయారీ**

మొత్తం కోటి చీరల్లో 95 లక్షల చీరలను 6.30 మీటర్ల పొడవుతో పాలిస్టర్ వస్త్రంతో, మరో 5 లక్షల చీరలను 9 మీటర్ల పొడవుతో పాలీకాటన్ వస్త్రంతో తయారు చేయించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నేత కార్మికులతోనే చీరలను నేయించడం ద్వారా మహిళలకు కానుక అందించడంతో పాటు చేనేత, వస్త్ర పరిశ్రమకు చెందిన కార్మికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది.

**ఎవరెవరికి అర్హత? ఎలా పొందాలి?**

రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన మహిళలందరూ ఇందిరమ్మ చీరలు పొందేందుకు అర్హులుగా ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన మహిళలు ఆహార భద్రత కార్డు, ఆధార్ వివరాలను చూపించి చీరలను పొందవచ్చు.

**వార్డుల వారీగా పంపిణీ ఏర్పాట్లు**

జిల్లా కలెక్టర్లు, జిల్లా ఇన్‌చార్జి మంత్రుల పర్యవేక్షణలో రాష్ట్రవ్యాప్తంగా చీరల పంపిణీ చేపట్టనున్నారు. గ్రామాలు, పట్టణాల్లో వార్డుల వారీగా ప్రజాప్రతినిధుల సమక్షంలో సెర్ప్ సిబ్బంది చీరలను అందజేయనున్నారు. పంపిణీలో పారదర్శకత కోసం ప్రత్యేక చరవాణి అనువర్తనంలో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయనున్నారు. మహిళలకు పండుగ కానుకగా చీరలు అందించడంతో పాటు రాష్ట్రంలోని నేత కార్మికులకు ఉపాధి కల్పించేలా రూపొందించిన ఈ కార్యక్రమంపై మహిళల్లో ఆసక్తి నెలకొంది.

# గంగారంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమం

- **చెన్నూరు మండలం గంగారం గ్రామంలో నమోదు ప్రక్రియ**
- **కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**
- **జైపూర్ ఏసీపీతో కలిసి గ్రామానికి చేరుకున్న కలెక్టర్**
- **ఎంపీడీవో, మార్కెట్ కమిటీ చైర్మన్ హాజరు**



**మంచిర్యాల, నవంబర్ 24 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** చెన్నూరు మండలం గంగారం గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు. గ్రామంలో పథకానికి సంబంధించిన నమోదు ప్రక్రియ చేపట్టిన సందర్భంగా ఆయన అక్కడికి చేరుకున్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో పాటు జైపూర్ ఏసీపీ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరితో పాటు మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మార్కెట్ కమిటీ చైర్మన్ హాజరయ్యారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో గంగారం గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి గ్రామంలో చేపట్టిన నమోదు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొనడం ఈ పర్యటనలో ప్రధాన అంశంగా నిలిచింది. పథకానికి సంబంధించిన వివరాలను నమోదు చేసే కార్యక్రమంలో ఆయనతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

గంగారం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ హాజరయ్యారు. చెన్నూరు మండల పరిధిలో పథకం నమోదు ప్రక్రియలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కలెక్టర్ కార్యాలయం వెల్లడించిన సమాచారం ద్వారా తెలుస్తోంది. కార్యక్రమంలో నమోదు చేసిన కుటుంబాల సంఖ్య, లబ్ధిదారుల వివరాలు, నమోదు ప్రక్రియకు సంబంధించిన ఇతర అంశాలపై అందిన సమాచారంలో పూర్తి వివరాలు వెల్లడించలేదు. అధికారుల పర్యటన, నమోదు కార్యక్రమంలో వారి భాగస్వామ్యానికి సంబంధించిన వివరాలు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి.



తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 25 - నవంబర్ 2026


# పాలేరు నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన





- **పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు**
- **అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, మృతుల కుటుంబాలకు పరామర్శ.. నూతన వధూవరులకు ఆశీర్వాదం**
- **సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రజాపాలన: మంత్రి పొంగులేటి**

**ఖమ్మం, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** పాలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల సమస్యలు తెలుసుకుంటూ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించడంతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, మృతుల కుటుంబాలను పరామర్శించి బాధితులకు అండగా నిలిచారు.ఖమ్మం రూరల్ మండలం నరసింహాపురం గ్రామానికి చెందిన సూరం శెట్టి రేణు బాబుకు ఇటీవల శస్త్రచికిత్స జరగడంతో మంత్రి ఆయనను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరెంపుల గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు గుండె వెంకన్న ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణపురంలో చిదుముల వెంకటరెడ్డి తల్లి మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. టేకులపల్లి గ్రామంలో పొదిల చిన్నపాపారావు కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నేలకొండపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చాగంటి నారాయణకు ఇటీవల శస్త్రచికిత్స జరగడంతో ఆయనను పరామర్శించి ఆరోగ్య వివరాలను తెలుసుకున్నారు.

**అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని రామన్నపేట కాలనీ 60వ డివిజన్‌లో అంతర్గత సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. స్థానికంగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తమది పేదల పక్షపాత ప్రజా ప్రభుత్వమని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రెండు కళ్లుగా భావిస్తూ ప్రజాపాలన అందిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని, ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

ఈ పర్యటనలో ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, కాంగ్రెస్ పార్టీ ఏదులాపురం మున్సిపాలిటీ అధ్యక్షుడు బానోత్ కిషోర్ నాయక్, ఖమ్మం రూరల్ మండల అధ్యక్షుడు తోట వీరభద్రం, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, డివిజన్ల బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత కోసం 16 రోజుల ఉద్యమం

- **నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు ప్రపంచవ్యాప్త అవగాహన కార్యక్రమాలు**
- **మహిళలు, బాలికలపై హింసను అరికట్టడమే ప్రధాన లక్ష్యం**
- **గృహహింస నుంచి సైబర్ వేధింపుల వరకు ప్రతి అంశంపై చైతన్యం**
- **సమానత్వం, గౌరవం, భద్రతపై సమాజానికి ప్రత్యేక సందేశం**




**డెస్క్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టడం, వారికి సురక్షితమైన సమాజాన్ని నిర్మించడం లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు 16 రోజుల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అంతర్జాతీయంగా 'లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా 16 రోజుల కార్యాచరణ'గా గుర్తింపు పొందిన ఈ కార్యక్రమం మహిళల హక్కులు, సమానత్వం, భద్రతపై విస్తృత అవగాహన కల్పించేందుకు వేదికగా నిలుస్తోంది. నవంబర్ 25న మహిళలపై హింస నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవంతో ప్రారంభమయ్యే ఈ ప్రచారం డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవంతో ముగుస్తుంది. మహిళలపై హింస అనేది కేవలం వ్యక్తిగత లేదా కుటుంబ సమస్య కాదని, అది మానవ హక్కులకు సంబంధించిన తీవ్రమైన అంశమని ప్రపంచానికి తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, విద్యాసంస్థలు, సామాజిక కార్యకర్తలు ఇందులో భాగస్వాములై వివిధ అవగాహన కార్యక్రమాలు చేపడతారు.

మహిళలపై హింస అనేక రూపాల్లో కొనసాగుతోంది. గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక దాడులు, బాల్యవివాహాలు, మానవ అక్రమ రవాణా, బలవంతపు వివాహాలు, కార్యాలయాల్లో వేధింపులు వంటి సమస్యలు మహిళల జీవితాలను ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబ సభ్యుల నుంచే హింసను ఎదుర్కొంటున్న మహిళలు అనేక సందర్భాల్లో బయటకు చెప్పుకోలేక మౌనంగా బాధపడుతున్నారు. కుటుంబ గౌరవం, పిల్లల భవిష్యత్తు, ఆర్థిక పరిస్థితి, సమాజంలో ఎదురయ్యే విమర్శల భయంతో తమకు జరిగిన అన్యాయాలను దాచిపెడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో బాధిత మహిళలకు అండగా నిలవడం, వారికి న్యాయపరమైన సహాయం అందించడం, హింసకు పాల్పడేవారిపై చర్యలు తీసుకునేలా సంబంధిత వ్యవస్థలను చైతన్యపరచడం అవసరం. మహిళలపై జరిగే ప్రతి రూపంలోని హింసను గుర్తించి, దానిని సాధారణ విషయంగా తీసుకోకుండా అరికట్టేందుకు సమాజంలో బాధ్యతాయుతమైన దృక్పథం పెంపొందించడమే ఈ 16 రోజుల ప్రచారంలో కీలక అంశం.

ప్రస్తుత కాలంలో మహిళలపై వేధింపులు సంప్రదాయ పద్ధతులకే పరిమితం కాకుండా డిజిటల్ ప్రపంచంలోనూ విస్తరిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, వ్యక్తిగత చిత్రాలను అనుమతి లేకుండా ప్రచారం చేయడం, మార్ఫింగ్ చిత్రాలతో బెదిరించడం, నకిలీ ఖాతాల ద్వారా వేధించడం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం వంటి సైబర్ నేరాలు మహిళలకు కొత్త సవాళ్లుగా మారుతున్నాయి. ఆన్‌లైన్ వేధింపుల కారణంగా కొందరు మహిళలు సామాజిక మాధ్యమాలకు దూరమవుతుండగా, మరికొందరు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడానికి వెనుకాడుతున్నారు. డిజిటల్ వేదికల్లోనూ మహిళలకు సమాన హక్కులు, గౌరవం, భద్రత కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ ప్రచారంలో భాగంగా ఆన్‌లైన్ వేధింపులపై అవగాహన, సైబర్ నేరాల ఫిర్యాదు విధానాలు, వ్యక్తిగత సమాచార రక్షణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని సురక్షితంగా వినియోగించుకోవడం వంటి అంశాలపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తారు. మహిళల భద్రత భౌతిక ప్రపంచానికే పరిమితం కాకుండా డిజిటల్ ప్రపంచంలోనూ నిర్ధారించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ముందుకు తీసుకెళ్తోంది.మహిళలపై హింసను అరికట్టేందుకు చట్టాలు చేయడంతోపాటు వాటి అమలు కూడా సమర్థంగా ఉండాలి. బాధిత మహిళలు ఫిర్యాదు చేయడానికి భయపడకుండా పోలీసు వ్యవస్థలో అనుకూలమైన వాతావరణం కల్పించాలి. వారికి న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక కౌన్సెలింగ్, అవసరమైనప్పుడు ఆశ్రయం కల్పించే వ్యవస్థలు అందుబాటులో ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు తమ హక్కులు, రక్షణ చట్టాలు, ప్రభుత్వ సహాయ వ్యవస్థలపై అవగాహన కల్పించడం ప్రత్యేకంగా అవసరం. పాఠశాలలు, కళాశాలల్లో లింగ సమానత్వం, పరస్పర గౌరవం, వ్యక్తిగత స్వేచ్ఛ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక కమిటీలను సమర్థంగా పనిచేయించాలి. మహిళలపై హింసకు సంబంధించిన ఘటనలు జరిగినప్పుడు బాధితులనే ప్రశ్నించే ధోరణిని విడనాడి, వారికి న్యాయం అందేలా సమాజం సహకరించాలి. ప్రభుత్వాలు, పోలీసు శాఖలు, న్యాయవ్యవస్థ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసినప్పుడే ఈ ప్రచారం ఆశించిన ఫలితాలను అందించగలదు. ఈ 16 రోజుల కార్యక్రమం కేవలం అవగాహన కల్పించడానికే కాకుండా మహిళలపై హింసను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరిలో బాధ్యతను పెంపొందించేందుకు కూడా ఉపయోగపడుతుంది. కుటుంబాల్లో ఆడపిల్లలు, మగపిల్లలకు సమానత్వ విలువలు నేర్పించడం, మహిళల నిర్ణయాలను గౌరవించడం, వారి స్వేచ్ఛను గుర్తించడం చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలి. మహిళలు ఆర్థికంగా స్వతంత్రంగా ఎదిగేందుకు విద్య, ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించాలి. హింసకు గురైన మహిళలు ఒంటరివారు కాదనే భరోసా కల్పిస్తూ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహోద్యోగులు అండగా నిలవాలి. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 10 వరకు జరిగే ఈ ప్రచారంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై మహిళల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి. మహిళలకు భద్రత కల్పించడం అంటే కేవలం నేరాలను అరికట్టడం మాత్రమే కాదు.. వారు ఎలాంటి భయం, వివక్ష, ఒత్తిడి లేకుండా తమ జీవితాలను స్వేచ్ఛగా తీర్చిదిద్దుకునే అవకాశాలు కల్పించడం కూడా. మహిళలపై హింస లేని సమాజం నిర్మాణం కోసం 16 రోజుల పాటు జరిగే ఈ ఉద్యమం ఏడాది పొడవునా కొనసాగే సామాజిక బాధ్యతగా మారాలి. అప్పుడే మహిళలకు గౌరవం, సమానత్వం, భద్రతతో కూడిన జీవితం సాధ్యమవుతుంది.

# సంవిధాన్ రక్షా మార్చ్ విజయానికి తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపు

- **సంవిధాన్ రక్షా మార్చ్ విజయవంతానికి ప్రతి డివిజన్ నుంచి 100 మంది తరలిరావాలి**
- **తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ జెండా ఎగరాలి.**
- **మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**

**మేడ్చల్,నవంబర్24 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఏఐసీసీ, పీసీసీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సంవిధాన్ రక్షా కార్యక్రమంలో భాగంగా నవంబర్ 26న హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. లిబర్టీ సర్కిల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ కొనసాగనుంది.రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటమే లక్ష్యంగా చేపట్టిన సంవిధాన్ రక్షా మార్చ్‌ను విజయవంతం చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో డీసీసీ జిల్లా మాజీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కూకట్పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కున్న శ్రీశైలం గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం ఇంచార్జి కొలను హనుమంత్ రెడ్డి,హనుమంత్ రెడ్డి,సీనియర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి లక్ష్మీకాంత్ రెడ్డిజిల్లా గ్రంధాలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహ యాదవ్ , జిల్లా డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మొఘల్ సైన్యాన్ని గడగడలాడించిన అస్సాం వీరుడు.. లాచిత్ బర్ఫుకన్!



- **దేశ రక్షణ కోసం ప్రాణాలనూ లెక్కచేయని యోధుడు**
- **సరైఘాట్ యుద్ధంలో అసాధారణ సైనిక వ్యూహం**
- **అనారోగ్యాన్ని సైతం లెక్కచేయని పోరాట పటిమ**
- **తరతరాలకు స్ఫూర్తినిచ్చే అస్సాం వీరగాథ**

**డెస్క్ నవంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** భారతదేశ చరిత్రలో ఎన్నోమంది వీరులు తమ ధైర్యసాహసాలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. దేశం, మాతృభూమి, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన యోధుల గాథలు నేటికీ తరతరాలకు స్ఫూర్తినిస్తున్నాయి. అలాంటి మహా వీరుల్లో అస్సాంకు చెందిన లాచిత్ బర్ఫుకన్ ఒకరు. పదిహేడో శతాబ్దంలో మొఘల్ సామ్రాజ్య విస్తరణను ఎదుర్కొని అస్సాం ప్రాంత స్వాతంత్ర్యాన్ని కాపాడేందుకు ఆయన సాగించిన పోరాటం భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. ముఖ్యంగా 1671లో జరిగిన సరైఘాట్ యుద్ధంలో ప్రదర్శించిన సైనిక ప్రతిభ, వ్యూహాత్మక నైపుణ్యం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి. ప్రతి సంవత్సరం నవంబర్ 24న అస్సాంలో లాచిత్ దివస్ నిర్వహిస్తూ ఆయన వీరత్వాన్ని, దేశభక్తిని స్మరించుకుంటారు. ఒక సైనిక నాయకుడిగా మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, బాధ్యత, నాయకత్వ లక్షణాలకు ప్రతీకగా ఆయనను గుర్తుచేసుకుంటారు.

**అహోం రాజ్యానికి అండగా నిలిచిన యోధుడు**

లాచిత్ బర్ఫుకన్ 1622 నవంబర్ 24న అస్సాంలో జన్మించారు. అప్పట్లో అస్సాం ప్రాంతాన్ని అహోం రాజవంశం పాలించేది. అహోం రాజ్యం తన ప్రత్యేక పరిపాలనా వ్యవస్థ, సైనిక నిర్మాణం, సాంస్కృతిక సంప్రదాయాలతో ప్రసిద్ధి చెందింది. లాచిత్ తండ్రి మోమై తములీ బర్బరువా అహోం రాజ్యంలో ఉన్నతాధికారిగా పనిచేశారు. చిన్నతనం నుంచే లాచిత్‌కు పరిపాలన, సైనిక వ్యవస్థ, యుద్ధ వ్యూహాలపై అవగాహన కల్పించారు. రాజ్య రక్షణ, ప్రజల సంక్షేమం, క్రమశిక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తూ ఆయన పెరిగారు. వివిధ బాధ్యతలను సమర్థంగా నిర్వహిస్తూ తన ప్రతిభను నిరూపించుకున్నారు. అహోం రాజు చక్రధ్వజ సింహా పాలనలో లాచిత్‌కు సైనిక బాధ్యతలు అప్పగించారు. అనంతరం ఆయనకు బర్ఫుకన్ అనే ఉన్నత సైనిక హోదా లభించింది. ఈ హోదా ద్వారా అహోం రాజ్య పశ్చిమ ప్రాంత రక్షణ, సైనిక వ్యవహారాలను పర్యవేక్షించే బాధ్యత ఆయనపై పడింది. అప్పటికే మొఘల్ సామ్రాజ్యం ఈశాన్య భారతదేశంపై తన ఆధిపత్యాన్ని విస్తరించేందుకు ప్రయత్నిస్తుండటంతో అహోం రాజ్యానికి లాచిత్ నాయకత్వం అత్యంత కీలకంగా మారింది.

**మొఘలుల విస్తరణకు అడ్డుకట్ట**

పదిహేడో శతాబ్దంలో మొఘల్ సామ్రాజ్యం దేశంలోని అనేక ప్రాంతాలపై తన ఆధిపత్యాన్ని విస్తరించింది. అస్సాంలోని వ్యూహాత్మక ప్రాంతాలను కూడా తమ ఆధీనంలోకి తీసుకోవాలనే లక్ష్యంతో మొఘల్ సైన్యం ముందుకు సాగింది. 1662లో మీర్ జుమ్లా నాయకత్వంలో మొఘల్ సైన్యం అస్సాంపై దండెత్తి గువాహటి సహా పలు ప్రాంతాలను ఆక్రమించింది. అనంతరం 1663లో ఘిలాజారీఘాట్ ఒప్పందం ద్వారా అహోం రాజ్యం కొన్ని షరతులకు అంగీకరించాల్సి వచ్చింది. ఈ పరిణామాలు అహోం రాజ్యంలో తీవ్ర అసంతృప్తికి కారణమయ్యాయి. మొఘలుల ఆధిపత్యాన్ని తొలగించి కోల్పోయిన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని అహోం రాజు చక్రధ్వజ సింహా నిర్ణయించారు. ఈ బాధ్యతను లాచిత్ బర్ఫుకన్‌కు అప్పగించారు. ఆయన సైన్యాన్ని పునర్వ్యవస్థీకరించి, ఆయుధాలను సమకూర్చి, యుద్ధానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. సైనికులకు శిక్షణ ఇవ్వడంతో పాటు బ్రహ్మపుత్ర నది పరిసర ప్రాంతాల భౌగోళిక పరిస్థితులను అధ్యయనం చేశారు. నదులు, కొండలు, అడవులు, ఇరుకైన జలమార్గాలను తమకు అనుకూలంగా ఉపయోగించుకునే వ్యూహాలను సిద్ధం చేశారు. క్రమంగా అహోం సైన్యం మొఘల్ సైన్యాన్ని ఎదుర్కొనే స్థాయికి చేరుకుంది.

**సరైఘాట్ యుద్ధం.. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన విజయం**

1671లో బ్రహ్మపుత్ర నదిపై గువాహటి సమీపంలోని సరైఘాట్ ప్రాంతంలో అహోం సైన్యం, మొఘల్ సైన్యం మధ్య కీలక యుద్ధం జరిగింది. మొఘల్ సైన్యానికి రామ్ సింగ్ నాయకత్వం వహించాడు. మొఘలుల సైన్యంలో పెద్ద సంఖ్యలో సైనికులు, గుర్రపు దళాలు, ఫిరంగులు, నౌకాదళం ఉండేవి. సంఖ్యాబలం, ఆయుధ సంపత్తి పరంగా మొఘల్ సైన్యం బలంగా ఉన్నప్పటికీ లాచిత్ తనకు అనుకూలమైన భౌగోళిక పరిస్థితులను సమర్థంగా వినియోగించుకున్నారు. ముఖ్యంగా బ్రహ్మపుత్ర నదిలోని ఇరుకైన మార్గాలు, నీటి ప్రవాహాలు, నదీ తీర ప్రాంతాలను యుద్ధ వ్యూహంలో భాగంగా చేసుకున్నారు. మొఘల్ సైన్యం నదిలోకి ప్రవేశించినప్పుడు అహోం నౌకాదళం దాడులు నిర్వహించింది. నదీ యుద్ధంలో స్థానిక పరిజ్ఞానం కీలకంగా మారింది. ఈ పోరాటంలో అహోం సైన్యం అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించి మొఘలుల ముందడుగును అడ్డుకుంది. చివరకు మొఘల్ సైన్యం వెనుదిరగాల్సి వచ్చింది. ఈ విజయంతో అస్సాంలో అహోం రాజ్య ఆధిపత్యం కొనసాగింది. సరైఘాట్ యుద్ధం భారత సైనిక చరిత్రలో నదీ యుద్ధ వ్యూహాలకు ఒక ముఖ్యమైన ఉదాహరణగా నిలిచిపోయింది.

**అనారోగ్యాన్ని సైతం లెక్కచేయని నాయకత్వం**

సరైఘాట్ యుద్ధ సమయంలో లాచిత్ బర్ఫుకన్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నట్లు చారిత్రక కథనాలు చెబుతాయి. అయినప్పటికీ రాజ్య రక్షణ బాధ్యతను విస్మరించలేదు. యుద్ధ పరిస్థితులు క్లిష్టంగా మారిన సమయంలో సైనికుల్లో కొంత నిరుత్సాహం ఏర్పడినట్లు తెలుసుకున్న ఆయన స్వయంగా రంగంలోకి దిగారు. పడవలోకి ఎక్కి సైన్యాన్ని ముందుండి నడిపించడంతో అహోం సైనికుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. నాయకుడు ముందుండి పోరాడితే సైనికుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందనే విషయాన్ని ఆయన తన చర్యల ద్వారా చూపించారు. సైనికుల క్రమశిక్షణ విషయంలోనూ ఆయన కఠినంగా వ్యవహరించేవారు. రాజ్య రక్షణకు సంబంధించిన బాధ్యతలను నిర్లక్ష్యం చేసే వారిని ఉపేక్షించేవారు కాదని చారిత్రక గాథలు తెలియజేస్తాయి. యుద్ధంలో విజయం సాధించిన తర్వాత కూడా ఆయన వ్యక్తిగత కీర్తికంటే రాజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారు. అయితే నిరంతర పోరాటాలు, అనారోగ్యం కారణంగా ఆయన ఆరోగ్యం క్షీణించింది. 1672 ఏప్రిల్ 25న ఆయన మరణించారు. తాను జీవించిన కొద్దికాలంలోనే అస్సాం చరిత్రపై చెరగని ముద్ర వేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# అమ్మ ప్రేమకు ఇదేనా విలువ?!





**కన్నతల్లి కడచూపునకు రాని కొడుకు..**
**తలకొరివి పెట్టేందుకు ముందుకురాని బిడ్డలు!**
**బంధాల కంటే స్వార్థమే ముఖ్యమైందా?**
**అనాథగా ముగిసిన తల్లి అంతిమయాత్ర!**
**బంధుత్వం మరిచిన చోట.. మానవత్వంతో ముందుకొచ్చిన పంచాయతీ సిబ్బంది**
**జనగామ జిల్లా తరిగొప్పులలో హృదయాలను కలచివేసిన ఘటన**

**తరిగొప్పుల, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు ప్రత్యేక కథనం):** పది నెలలు కడుపులో మోసింది.. పురిటినొప్పులను భరించి ఈ లోకానికి తీసుకొచ్చింది.. తన ఆకలిని పక్కనపెట్టి బిడ్డల కడుపు నింపింది.. వేల కష్టాలు ఎదురైనా పిల్లల భవిష్యత్తు కోసం తన జీవితాన్నే ధార పోసింది. కంటికి రెప్పలా పెంచి పెద్ద చేసింది. కానీ.. జీవిత చరమాంకంలో ఆ తల్లికి మాత్రం కన్నబిడ్డల నుంచి దక్కింది ఏమిటి? కడచూపునకు రాని కొడుకు.. తలకొరివి పెట్టేందుకు ముందుకు రాని కుమార్తెలు! చివరకు గ్రామస్తులే బిడ్డలై పాడె మోసి సాగనంపిన హృదయవిదారక దృశ్యం!

**బిడ్డల కోసం బతికిన తల్లి..**
**చివరకు ఒంటరిగానే!**

జనగామ జిల్లా తరిగొప్పుల మండల కేంద్రానికి చెందిన నాగబండి రామచంద్రం, పుష్పనీల దంపతులకు ఒక కుమారుడు, ఐదుగురు కుమార్తెలు. ఆరుగురు సంతానంతో కుటుంబ జీవితం సాగించిన ఆ దంపతుల్లో ముందుగా రామచంద్రం కన్నుమూశారు. భర్త మరణం తర్వాత పుష్పనీల ఒంటరిగానే జీవనం సాగించారు. చివరకు సోమవారం ఆమె కూడా తుదిశ్వాస విడిచారు.తన జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని పిల్లలను పెంచిన ఆ తల్లి.. చివరకు తన జీవిత ప్రయాణాన్ని ముగించింది. సాధారణంగా తల్లిదండ్రులు మరణిస్తే కన్నబిడ్డలు చివరిసారిగా చూసేందుకు పరుగున వస్తారు. అంతిమ సంస్కారాలు నిర్వహించి కన్నీటితో వీడ్కోలు పలుకుతారు. కానీ పుష్పనీల విషయంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారింది.

**ఫోన్ చేసినా.. రాలేనన్న కొడుకు!**

తల్లి మరణించిందన్న సమాచారాన్ని హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడికి గ్రామస్తులు ఫోన్ ద్వారా చేరవేశారు. అయితే తాను రాలేనని అతడు సమాధానమిచ్చినట్లు సమాచారం. మరోవైపు అంత్యక్రియలకు వచ్చిన ఇద్దరు కుమార్తెలు సైతం తల్లికి తలకొరివి పెట్టేందుకు నిరాకరించినట్లు తెలిసింది.
కన్నతల్లి ఇక తిరిగిరాదని తెలిసినా.. ఆమె చివరి ప్రయాణంలో తోడుగా నిలిచేందుకు కన్నబిడ్డలు ముందుకు రాకపోవడం గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది. ఆ తల్లి జీవితంలో ఎదురైన కష్టాలకంటే చివరి సమయంలో ఎదురైన ఈ పరిస్థితి మరింత విషాదాన్ని నింపింది.

**బంధువులు వెనక్కి తగ్గినా..**
**గ్రామస్తులు ముందుకొచ్చారు!**

కన్నబిడ్డలే బాధ్యత తీసుకోని పరిస్థితుల్లో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు మానవత్వంతో ముందుకొచ్చారు. నాగబండి కుటుంబానికి చెందిన ఆర్యవైశ్య కులస్తులు, స్థానికులు కలిసి అంత్యక్రియల ఏర్పాట్లు చేశారు. పాడె మోసి ఆ తల్లిని కడసారి సాగనంపారు.
తల్లికి చివరి వీడ్కోలు పలకాల్సిన బిడ్డల స్థానంలో గ్రామస్తులు నిలిచారు. కుటుంబ సభ్యుల నుంచి ఆశించిన ఆత్మీయత దక్కని చోట.. గ్రామ ప్రజలు చూపిన మానవత్వం అందరినీ కదిలించింది. ఎవరికీ సంబంధం లేని ఓ తల్లి అంతిమ సంస్కారాల కోసం ముందుకొచ్చిన వారి ఔదార్యం పలువురి ప్రశంసలు అందుకుంది.

**ఆస్తుల కోసం కాదు..**
**ఆప్యాయత కోసం ఎదురుచూసే అమ్మ!**

ఈ ఘటన కేవలం తరిగొప్పుల గ్రామానికే పరిమితమైన విషాదం కాదు. ఆధునిక సమాజంలో కుటుంబ బంధాలు, తల్లిదండ్రుల పట్ల పిల్లల బాధ్యతలను మరోసారి ప్రశ్నించే సంఘటన.బిడ్డల కోసం తల్లిదండ్రులు చేసే త్యాగాలకు లెక్కలేదు. వారి భవిష్యత్తు కోసం తమ సంతోషాలను సైతం వదులుకుంటారు. పిల్లలు ప్రయోజకులైతే అదే తమ జీవితానికి గొప్ప సంతృప్తిగా భావిస్తారు. కానీ వృద్ధాప్యంలో వారికి కావాల్సింది పెద్ద పెద్ద ఆస్తులు, అంతస్తులు కాదు.. నాలుగు ఆప్యాయత మాటలు, కాసింత ఆదరణ, అవసరమైనప్పుడు తోడుగా నిలిచే మనుషులు మాత్రమే. బతికున్నప్పుడు తల్లిదండ్రులను ఎంతగా ఆదరిస్తున్నాం? వారి ఒంటరితనాన్ని ఎంతవరకు అర్థం చేసుకుంటున్నాం? చివరి దశలో వారికి అండగా నిలుస్తున్నామా? అనే ప్రశ్నలు ప్రతి ఒక్కరూ తమను తాము వేసుకోవాల్సిన అవసరం ఉంది.

**కన్నవారు కాదనుకున్నా..**
**కన్నీటితో సాగనంపారు!**

పుష్పనీలకు కన్నబిడ్డలు ఉన్నారు.. కుటుంబం ఉంది.. బంధుత్వాలు ఉన్నాయి. అయినప్పటికీ ఆమె అంతిమ యాత్రలో గ్రామస్తులే అండగా నిలిచారు. రక్తసంబంధం లేకపోయినా మానవత్వంతో ముందుకొచ్చిన పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు ఓ తల్లికి గౌరవప్రదమైన చివరి వీడ్కోలు అందించారు.కన్నతల్లి బతికున్నప్పుడు ఆమె విలువ తెలుసుకోవాలి. ఆమె మరణించిన తర్వాత కన్నీళ్లు పెట్టుకున్నా తిరిగి రాదు. మనల్ని ఈ లోకానికి పరిచయం చేసిన అమ్మకు చివరి మజిలీలోనైనా తోడుగా నిలవలేకపోతే.. మనం సాధించిన సంపదకు, సంపాదించిన హోదాకు అర్థమేముంటుంది?తరిగొప్పుల గ్రామస్తులు చూపిన మానవత్వం ఒకవైపు మనసులను తాకుతుంటే.. పుష్పనీల జీవితంలో చోటుచేసుకున్న ఈ విషాదం సమాజాన్ని ఆలోచింపజేస్తోంది.
అమ్మను కోల్పోయిన బాధ ఒకవైపు.. అమ్మకు కడసారి వీడ్కోలు పలికే అవకాశం ఉన్నారని బిడ్డల తీరు మరోవైపు.. చివరకు పరాయివారే ఆ తల్లికి ఆత్మీయులై సాగనంపిన వైనం.. ఇదీ తరిగొప్పుల కన్నీటి కథ!

# సెప్టిక్ ట్యాంక్‌లో విషవాయువులు.. ముగ్గురు కార్మికుల మృతి



- **శుభ్రం చేసేందుకు లోపలికి దిగి తిరిగిరాని వైనం**
- **బాచుపల్లిలోని అపార్ట్‌మెంట్‌లో విషాద ఘటన**
- **హైడ్రా, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు**
- **మృతులు శ్రీకాకుళం జిల్లాకు చెందినవారిగా గుర్తింపు**

**హైదరాబాద్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** సెప్టిక్ ట్యాంక్ శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన ముగ్గురు కార్మికులు విషవాయువులు పీల్చి మృతి చెందిన విషాద ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్, ఏపీఆర్ ఎన్‌క్లేవ్‌లో చోటుచేసుకుంది. సోమవారం ఉదయం సుమారు 11.30 గంటల సమయంలో హెచ్‌ఆర్ ఇన్ఫిరో సంస్థకు చెందిన ముగ్గురు కార్మికులు ట్యాంక్ శుభ్రం చేసేందుకు అక్కడికి వచ్చారు. పనిలో భాగంగా ఒకరి తర్వాత ఒకరు ట్యాంక్‌లోకి దిగగా, తిరిగి బయటకు రాలేదు. దీంతో అపార్ట్‌మెంట్ పరిసరాల్లో ఆందోళన నెలకొంది. సమాచారం అందుకున్న వెంటనే హైడ్రా ఎస్ఎఫ్ఓ శ్రీనివాస్ నేతృత్వంలో విపత్తు స్పందన బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది కూడా సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ట్యాంక్‌లో చిక్కుకున్న కార్మికులను బయటకు తీసుకువచ్చేందుకు ప్రత్యేక పరికరాలను ఉపయోగించి రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. తీవ్రంగా శ్రమించిన సిబ్బంది ముగ్గురి మృతదేహాలను బయటకు తీశారు. మృతులను శ్రీకాకుళం జిల్లాకు చెందిన పాపన్ యల్లా (20), కె.శణ్ముఖరావు అలియాస్ సుమన్ (26), సురేష్ (24)గా గుర్తించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతానికి వచ్చిన ముగ్గురు కార్మికులు ఒకే ఘటనలో ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాల్లో విషాదం నెలకొంది. మృతదేహాలను బయటకు తీసిన అనంతరం పోలీసులు తదుపరి చర్యలు చేపట్టారు. దినేష్ ఆరిక్ అపార్ట్‌మెంట్ యాజమాన్య సంఘానికి, హెచ్‌ఆర్ ఇన్ఫిరో సంస్థకు మధ్య సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే పనులకు సంబంధించి ఒప్పందం ఉన్నట్లు సమాచారం. అపార్ట్‌మెంట్ సంఘం అభ్యర్థన మేరకు ఆ సంస్థ సిబ్బంది తరచూ అక్కడ శుభ్రత పనులు నిర్వహించేవారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం ముగ్గురు కార్మికులు పనికి వచ్చి ప్రమాదానికి గురయ్యారు. ట్యాంక్‌లో పేరుకుపోయిన విషపూరిత వాయువుల కారణంగా ఊపిరాడక వారు మృతి చెంది ఉంటారని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.సెప్టిక్ ట్యాంకుల శుభ్రత పనుల్లో తగిన భద్రతా చర్యలు పాటించకపోతే ప్రాణాపాయం తప్పదని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది. ట్యాంక్‌లోకి దిగే ముందు విషవాయువుల ఉనికిని పరీక్షించడం, అవసరమైన రక్షణ పరికరాలు వినియోగించడం వంటి జాగ్రత్తలు కీలకం. అయితే ఈ ప్రమాదానికి దారితీసిన ఖచ్చితమైన కారణాలు, పనుల సమయంలో భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే అంశాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ‘చిల్డ్రన్ బ్యాంక్’ పేరుతో నకిలీ నోట్ల మోసం



- **ఆరుగురు సభ్యుల ముఠా గుట్టురట్టు నలుగురు అరెస్ట్..**
- **మరో ఇద్దరు వేరే కేసులో అదుపులో**
- **రూ.40 లక్షలకు పైగా విలువైన నకిలీ నోట్లు స్వాధీనం**

**ఆదిలాబాద్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ‘చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా’ పేరుతో నకిలీ కరెన్సీ నోట్లను ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్న ఆరుగురు సభ్యుల ముఠా గుట్టును ఆదిలాబాద్ పోలీసులు రట్టు చేశారు. ఈ వ్యవహారంలో నలుగురు నిందితులను అరెస్టు చేయగా, మరో ఇద్దరు ఇప్పటికే వేరే కేసులో పోలీసుల అదుపులో ఉన్నట్లు వెల్లడించారు. ముఠా కార్యకలాపాలపై దర్యాప్తు కొనసాగిస్తున్న పోలీసులు, నకిలీ కరెన్సీ ద్వారా ప్రజలను మభ్యపెట్టి డబ్బులు వసూలు చేస్తున్న విధానాన్ని గుర్తించారు. నిందితుల నుంచి రూ.40 లక్షలకు పైగా విలువైనవిగా చూపించే 99 నకిలీ నోట్ల కట్టలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 100 నకిలీ బంగారు నాణేలు, మూడు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ‘చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా’ పేరుతో ఉన్న నోట్లను అసలు కరెన్సీగా నమ్మించి బాధితులను మోసం చేసేందుకు ముఠా ప్రయత్నించినట్లు పోలీసుల సమాచారం. పూజలు నిర్వహిస్తే డబ్బు రెట్టింపు అవుతుందని నమ్మించి అమాయకుల నుంచి భారీ మొత్తంలో నగదు వసూలు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ తరహా మోసాలకు ఆధ్యాత్మిక విశ్వాసాలను ఉపయోగించుకుని బాధితులను ఆకర్షించినట్లు తెలిపారు. మంచిర్యాలకు చెందిన ఒక వ్యక్తి ఈ ముఠా చేతిలో రూ.8 లక్షలు కోల్పోయినట్లు గుర్తించారు. డబ్బు రెట్టింపు అవుతుందనే ఆశతో బాధితులు తమ వద్ద ఉన్న నగదును నిందితులకు అప్పగించినట్లు వివరించారు. ఈ ముఠా మోసాలకు తెలంగాణలో సుమారు 40 మంది వరకు బాధితులు ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన ఘటనలతో పాటు మరికొందరు బాధితులు ఉన్నారా అనే కోణంలో విచారణ చేపడుతున్నారు. నిందితులు ఎవరెవరిని సంప్రదించారు, ఎంతమొత్తంలో నగదు వసూలు చేశారు, ఈ వ్యవహారంలో మరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.డబ్బును రెట్టింపు చేస్తామని, పూజల ద్వారా సంపదను పెంచుతామని చెప్పే వ్యక్తుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రజలను హెచ్చరించారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయనే ఆశతో అపరిచితులకు నగదు అప్పగించవద్దని సూచించారు. ఇలాంటి అనుమానాస్పద వ్యవహారాలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు.

# మద్దిమడుగులో రూ.100 కోట్లతో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహం

- **ఈ నెల 26న సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనకు ఏర్పాట్లు**
- **విగ్రహ నిర్మాణంతో పాటు సేవాలాల్ భవనం ఏర్పాటు**
- **ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు**
- **ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు**

**నాగర్‌కర్నూల్, నవంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని మద్దిమడుగు హనుమాన్ ఆలయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ నెల 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మద్దిమడుగు పర్యటన నేపథ్యంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలు, బహిరంగ సభ ఏర్పాట్లను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థాన అభివృద్ధి పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమాల అనంతరం బహిరంగ సభ నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సభా ప్రాంగణం, ప్రజలు చేరుకునే మార్గాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలపై మంత్రి అధికారులతో చర్చించారు.
సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున రాక పోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వాహనాల పార్కింగ్‌కు తగిన స్థలాలను సిద్ధం చేయాలని, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.భద్రతా ఏర్పాట్ల విషయంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన పనులను నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న లంబాడీ గిరిజన సమాజానికి ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ సేవలు, బోధనలు, ఆదర్శాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఆయన స్మృతిని చిరస్థాయిగా నిలిపే ఉద్దేశంతో నల్లమల్ల అటవీ ప్రాంతంలోని మద్దిమడుగులో రూ.100 కోట్ల వ్యయంతో భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ భవనాన్నికూడా నిర్మించనున్నట్లు తెలిపారు.
మద్దిమడుగు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా గుర్తింపు పొందిందని మంత్రి పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, దేవస్థాన ప్రాంగణాన్ని అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందుకోసం రూ.20 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పనులు పూర్తయితే భక్తులకు మరింత మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు.





Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in